

అనకాపల్లి జిల్లా పరవాడలో రోడ్లపై గుంతలు పూడ్చే పనులు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు



కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు. చిత్రంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు, కేఎస్ఎన్ఎస్ రాజు, కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద ఉన్నారు




రుషికొండ ప్యాలెస్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉన్నారు

విశాఖకు ఔటర్ రింగ్

విజయనగరం, భోగాపురం, అనకాపల్లి పట్టణాలను కలుపుతూ నిర్మాణం

- ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశం



- పీపీపీ విధానంలో అభివృద్ధి పనులు
- విశాఖలో పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేయాలి
- 2026లో భోగాపురం విమానాశ్రయం పూర్తి
- అరకు కాఫీ, పసుపు, మిరియాలకు మరింత బ్రాండింగ్
- విశాఖ అవసరాలు తీర్చేలా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పంటల సాగు
- సంక్రాంతి తరువాత రోడ్లపై ఎక్కడైనా గుంతలు కనిపిస్తే సంబంధిత అధికారిని సస్పెండ్ చేస్తా
- అల్లూరి జిల్లాలో విద్యా విధానం మెరుగుపడాలి
- డోలీ మోతలు ఉండకూడదు
- గిరిజన యువతకు గైడ్లుగా శిక్షణ ఇచ్చి పర్యాటక ప్రాంతాల్లో ఉపయోగించుకోవాలి
- విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల సమీక్షలో సీఎం నారా చంద్రబాబునాయుడు
- నగరంలో రౌడీయిజం లేకుండా చూడాలని సీపీకి సూచన
- పంచగ్రామాల భూ సమస్యపై చర్చ

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నగరాన్ని కలుపుతూ విజయనగరం, నెల్లిమర్ల, భోగాపురం, అనకాపల్లి పట్టణాలకు ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. హైదరాబాద్ మాదిరిగా విశాఖను అభివృద్ధి చేయాలన్నారు.



కలెక్టరేట్‌లో శనివారం మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖ కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల సమీక్షా సమావేశంలో అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు, వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్, నీతి అయోగ్ గ్రోత్ హబ్, రహదారుల అనుసంధానం, తదితర అభివృద్ధి పనుల్లో పీపీపీ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అధికారులంతా హార్డ్ వర్క్ చేయకుండా స్మార్ట్‌గా పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. విశాఖలో పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేయాలన్నారు. చిన్నపిల్లలు వచ్చి ఆడుకునేలా పార్కులను తీర్చిదిద్దాలన్నారు. ఎక్కడి నుంచైనా పర్యాటకులు వస్తే వారం రోజులు ఇక్కడే ఉండేలా ఆకర్షణీయమైన ప్రాజెక్టులు రూపొందించాలని ఆదేశించారు. అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల కోసం దేశ, విదేశాల్లో ... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

- రైల్వే జోన్‌కు కొద్దిరోజుల్లోనే భూమి పూజ
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చి పాలన సాగిస్తున్నాం
- విశాఖను టీడీపీకి కంచుకోటగా నిలబెట్టారు... కార్యకర్తలకు రుణపడి ఉంటా
- సభ్యత్వ నమోదు అనంతరం కమిటీల నియామకం
- పార్టీ కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు



తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

విశాఖపట్నం/మహారాణిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):

విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, కర్మాగారాన్ని వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంటును రక్షించుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. గతంలో ఇలాంటి ప్రతిపాదన వచ్చినప్పుడు అప్పటి వాజపేయి ప్రభుత్వంతో మాట్లాడి ప్లాంటు ప్రైవేటుపరం కాకుండా చూసినట్టు చెప్పారు. రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తవుతోందని, కొద్దిరోజుల్లోనే భూమిపూజ చేస్తామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ లోపాలను సరిదిద్దుతూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తమపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమని స్పష్టం చేశారు. గడిచిన ఐదేళ్లు సమాజాన్ని జగన్ అతలాకుతలం చేశాడని, విశాఖను పూర్తిగా కబ్జా చేశాడని విమర్శించారు. విశాఖ ప్రజలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి సృష్టించాడన్నారు. విశాఖలో రాజధానిని పెడతామంటే ఇక్కడి ప్రజలు నిర్మొహమాటంగా తిరస్కరించారని, టీడీపీకి ఓట్లేసి తమ నిర్ణయాన్ని స్పష్టం చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి దొంగ వేషాలు ఇక్కడి ప్రజలు గుర్తించారన్నారు. ప్రజలు ఆస్తులు, డబ్బుతో ప్యాలెస్‌లు కడతావా..? అంటూ జగన్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. ప్యాలెస్‌లోని టాయ్‌లెట్లు, బెడ్‌రూమ్‌లు చూస్తే కళ్లు తిరిగాయని, తనకేమీ అర్థం కాలేదన్నారు. ఆ భవనంలో ఏర్పాటుచేసిన ఫ్యాన్లను ... మిగతా 6వ పేజీలో



సిరిపురం జంక్షన్‌లో గుంత పూడుస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి, పురపాలక మంత్రి నారాయణ, ఎంపీ భరత్ తదితరులు

క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా విశాఖ

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి
- సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలు పూడ్చివేత

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):

రహదారులపై ఏర్పడిన గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడుస్తామని, సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి తెలిపారు. సిరిపురం జంక్షన్‌లో రోడ్డుపై పడిన గుంతను పురపాలక శాఖా మంత్రి నారాయణతో కలిసి ఆయన శనివారం ఉదయం పూడ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ నేతలు గత ఐదేళ్లలో ప్రజాధనం దోచుకున్నారే తప్ప పది మందికి ఉపయోగపడే పనులు ఏమీ చేయలేదన్నారు. వారి హయాంలో రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విశాఖ నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.11,500 కోట్లతో మెట్రో మొదటి దశ

ఫ్లైఓవర్లు లేకుండా సిటీలో డబుల్ డెక్కర్ మోడల్

- మరో రూ.3 వేల కోట్ల కోసం ప్రతిపాదనలు
- పురపాలక శాఖ మంత్రి నారాయణ



జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ, ఇన్‌ఛార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశ పనులు రూ.11,500 కోట్లతో చేపట్టనున్నామని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ వెల్లడించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం ఆయన, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, ఇటీవలె ఢిల్లీ వెళ్లి మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. అయితే నగరంలో పది చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాల్సిన అవసరం ఉందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ చెప్పారని, అయితే వాటి అవసరం లేకుండా మెట్రో ప్రాజెక్టులోనే డబుల్ డెక్కర్ విధానంలో ఒక దానిపై రైళ్లు, మరో దానిపై వాహనాలు వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. దీనికి ... మిగతా 6వ పేజీలో



మెట్రోకెమ్ ఫార్మా కంపెనీ లోపల నుంచి ఎగిసిపడుతున్న మంటలు

మెట్రోకెమ్ ఫార్మాలో పేలుడు

- రియాక్టర్ మ్యాన్‌హోల్ ఓపెన్ కావడంతో ప్రమాదం
- పరుగులు తీసిన కార్మికులు

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ (ఏపీఐ) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో శనివారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-ఏలో రాత్రి తొమ్మిది గంటలకు రియాక్టర్ మ్యాన్‌హోల్ రసాయనాల ఒత్తిడికి గురై ఓపెన్ అయ్యింది. రసాయనాలు ఒక్కసారిగా బయటకు తుళ్లిపడడంతో మంటలు వ్యాపించాయి. - 6వ పేజీలో

దివ్యాంగ విద్యార్థులకు టెన్త్ పరీక్షల్లో మినహాయింపులు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు పలు మినహాయింపులు ఇస్తూ విద్యా శాఖ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని అమలు చేయాలని డీఈఓ అన్ని ఉన్నత పాఠశాలలకు శనివారం ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్షల్లో కనీసం 35 నుంచి 25 మార్కులు వచ్చినా సరిపోతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే వారికి పరీక్ష పేపర్లు దిద్దే సమయంలో కూడా కొన్ని మినహాయింపులు ఇచ్చారు. భాషాపరమైన దోషాలు చేసినా, గ్రాఫ్‌లు, మ్యాప్‌లు వంటివి సరిగ్గా వేయకపోయినా పూర్తి మార్కులు వేయాలని తెలిపారు. అలాగే పరీక్షలు రాయడానికి సహాయకులను కూడా తీసుకువెళ్లవచ్చునని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

కొమ్మాది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హెచ్చరించారు. కొమ్మాదిలో సర్వే నంబరు మార్కి గ్రామానికి చెందిన 1500 గజాల రామాలయం భూమిని స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కాకుండా అక్రమంగా వేరే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 750 గజాల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించారని గ్రామానికి చెందిన కొంతమంది ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. శనివారం వారు ఎంవీపీ కాలనీలో గంటాను కలిశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అక్రమంగా క్రయ విక్రయాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని చినగదిలి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఏ పార్టీకి చెందిన వారైనా సహించేది లేదన్నారు.

14న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

తగరపువలస, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ ఈనెల 14న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని విద్యా శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏర్పాట్లను విద్యార్థులతో చేయించాలని, వారిని అన్ని విషయాల్లో భాగస్వాములుగా చేయాలని తెలిపారు. తల్లిదండ్రులతో పాటు పాఠశాలల అభివృద్ధికి సహకరించే దాతల్ని కూడా ఆహ్వానించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కార్తీక పూజలకు శివాలయాలు ముస్తాబు


శివాలయంలో జరుగుతున్న పనులు

భీమునిపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం రావడంతో పట్టణంలోని శివాలయాలను కమిటీ సభ్యులు పూజలకు ముస్తాబు చేస్తున్నారు. భక్తులకు సదుపాయంగా ఉసిరి చెట్టు, రావిచెట్టు, తులసీ మొక్కల వద్ద సిమ్మెంట్ కాంక్రీట్ పనులు చేస్తున్నారు.అలాగే పురాతన స్వయంభూ దేవాలయం, శ్రీ భ్రమరాంబికా చోడేశ్వరాలయానికి, కాత్యాయిన సహిత భీమేశ్వరాలయం, బాలా త్రిపుర సుందరి సహిత చంద్రశేఖరాలయాలను కూడా ముస్తాబు చేస్తున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

భీమునిపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. శనివారం ఆయన బోయవీధి, తోటవీధి, ఎగువపేట, ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కిరి అప్పన్న, కాసరపు నాగరాజు, జలగడుగుల మురళీ, నొల్లి రమణ, చురకల రమణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి పాదాలు బహూకరణ

మధురవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని టైలర్స్ కాలనీ విజయదుర్గ ఆలయంలో ఉన్న అమ్మవారికి మధురవాడ శివశక్తినగర్‌కు చెందిన భక్తులు వెండి పాదాలు బహూకరించారు. శివశక్తినగర్‌కు చెందిన నాగబాబ్జీ దంపతులు 759 గ్రాముల వెండితో వీటిని తయారు చేయించారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మీ చేతుల మీదుగా అర్చకులకు అందించారు.

13 వినతుల స్వీకరణ

పద్మనాభం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో రెవెన్యూ అధికారులు 13 వినతులు స్వీకరించారు. పేరు మా ర్పునకు 4, విస్తీర్ణంలో మార్పునకు 5, జాయింట్ ఎల్‌పీఎంలపై అభ్యంతరాలకు 4 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ కె. ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ వరలక్ష్మి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రేపు

పద్మనాభం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా హాజరుకానున్నట్టు చెప్పారు.

రాష్ట్రాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

- జన సైనికులకు నాదెండ్ల పిలుపు
- నగరంలోని జనసేన కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి


సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయ సాధన కోసం, రాష్ట్ర నిర్మాణం కోసం మనమంతా కలిసి పనిచేద్దామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర జనసేన పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో జనసేన పార్టీ చేపట్టిన 'గుడ్ మార్నింగ్ సీఎం' ద్వారా ప్రజల కష్టాలు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రోజు కూడా మనమంతా అంకితభావంతో రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములం అవుదామని, ఇది మన బాధ్యత అన్నారు. పదవులు ఎవరికి వచ్చినా, రాకపోయినా మనమంతా పనిచేసేది ఒక ఆశయసాధన కోసమన్నారు.దక్షిణ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలో పనిచేసిన ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, అహర్నిశలు పనిచేసిన మంత్రి మనోహర్ మనందరికీ ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎం ఎస్‌ఎంఈ ఛైర్మన్ తమ్మినేని శివశంకర్ జన్మదిన వేడుకలు నిర్వహించి కేకు కోశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, వివిధ స్థాయిల నాయకులు, కార్పొరేటర్లు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న కార్ట్ సభ్యులు

సీఎం దృష్టికి బ్లూఫ్లాగ్ నిర్వహణ లోపాలు

సాగర్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్ బ్లూఫ్లాగ్ నిర్వహణ లోపాలపై సిటిజన్స్ అసోసియేషన్ ఫర్ రెస్పాన్సిబిలి టూరిజం (కార్ట్) అధ్యక్షుడు పీఎస్ఎస్ ప్రకాశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువచ్చారు. శనివారం ఆయన రుషికొండ వద్ద సీఎంను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుషికొండ బీచ్‌లో బ్లూఫ్లాగ్ పేరుతో నిర్వహిస్తున్న పనుల్లో లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేయకపోతే బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. అలాగే రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ కోసం బీచ్‌కు వెళ్లడానికి నిర్మించిన రహదారిని మూసివేశారని, దీనివల్ల బీచ్‌కు ఉన్న ఒక్క రహదారిపై తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. తక్షణమే మూసివేసిన రహదారిని పునరుద్ధరించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి సాయి సంజన, ఉపాధ్యక్షుడు జస్టిన్ జోసెఫ్ ఉన్నారు.

చంద్రబాబును కలిసిన జన సైనికులు

ఎండాడ, : రుషికొండ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును భీమిలి నియోజకవర్గానికి చెంది న జనసేన సైనికులు ఆ పార్టీ సమన్వయకర్త పంచకర్ల సందీప్ ఆధ్వర్యంలో కలిశారు. అలానే రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కూడా కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, ఆర్. కృష్ణయ్య, హరిబాబు, శివ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో గోవర్ధన పూజా మహోత్సవం


మందిరంలో ఏర్పాటు చేసిన గోవర్ధన పర్వతం

సాగర్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో గోవర్ధన పూజామహోత్సవాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిరంలో గోవర్ధన పర్వతాన్ని తలపించే విధంగా వివిధ రకాల మిఠాయిలు, పలుకులు, పండ్లతో అన్నకూట్ (ఆహార పర్వతం) ఏర్పాటు చేశారు. భక్తులు ఆహార పర్వతం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచామృతాభిషేకాలు, పుష్పాభిషేకాలు, హారతులు పట్టి గిరిప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా భక్తులు తయారు చేసిన 1008 రకాల భోగాలను గిరిరాజుకి ప్రసాదంగా సమర్పించారు. అనంతరం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఇస్కాన్ ఆవరణం కిక్కిరిసిపోయింది.



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిప్పాడలో పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ

భీమునిపట్నం (రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు ఇంటింటికి వెళ్లి పొగాకు వల్ల జరిగే అనారోగ్య సమస్యలను తెలియజేసి, చుట్ట, బీడీ, సిగరెట్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎంవీజే రత్నం, రేఖ అప్పారావు, విజయకుమార్, చిన్నయ్య, కనక మహాలక్ష్మి, సంగీత మిత్రా పాల్గొన్నారు.

భార్య, కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ఎండాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తన భార్య, కుమార్తె కనిపించడం లేదని ఓ వ్యక్తి పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిథిలాపురి ఉడా కాలనీ వెర్టిలా బృందావన్ అపార్ట్‌మెంట్‌లో నాగరాజు వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో భార్య ఆదిలక్ష్మీ (28) కుమార్తె తనుశ్రీ (3)తో కలిసి ఉంటున్నాడు. శనివారం ఉదయం భార్యాభర్త మధ్య గొడవ జరిగింది. అనంతరం నాగరాజు టిఫిన్ చేయడానికి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి భార్య, కుమార్తె కనిపించలేదు. అపార్ట్‌మెంట్‌కు ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా వారు వెనుక గేట్ నుంచి బయటకు వెళ్లినట్టు గుర్తించారు. స్థానికంగా వెతికినా ఫలితం లేకపోవడంతో నాగరాజుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మెట్రోకెమ్ ఫార్మాలో పేలుడు

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ (ఏపీఐ) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో శనివారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ సంఘటనకు సంబంధించి కార్మికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-ఏలో రాత్రి తొమ్మిది గంటలకు రియాక్టర్ మ్యాన్‌హోల్ రసాయనాల ఒత్తిడికి గురై ఓపెన్ అయ్యింది. రసాయనాలు ఒక్కసారిగా బయటకు తుళ్లిపడడంతో మంటలు వ్యాపించాయి. దీంతో బ్లాక్ వద్ద పనిచేస్తున్న కార్మికులంతా భయాందోళనతో అక్కడి నుంచి పరుగులు తీశారు. పేలుడు ధాటికి బ్లాక్‌లోని కిటికీ అద్దాలన్నీ పగిలి పక్కనే ఉన్న రోడ్డుపైకి వచ్చి పడ్డాయి. సుమారు 20 నిమిషాలకు పైగా మంటలు ఎగిసిపడ్డాయి. ముందస్తు చర్యల్లో భాగంగా యాజమాన్యం విద్యుత్ సరఫరాను నిలిపివేసింది.సమాచారం అందుకున్న రాంకీ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది. అయితే ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరికీ గాయాలు కాలేదని హెచ్ఆర్ ప్రతినిధి తేజ స్థానిక విలేకరులకు తెలిపారు. అయితే ప్రమాద తీవ్రత దృష్ట్యా నలుగురు కార్మికులు గాయపడ్డారని, అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారని చెబుతున్నారు. తానాం గ్రామానికి చెందిన పలువురు యువకులు కంపెనీ వద్దకు చేరుకుని యాజమాన్యం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం ఎలా జరిగిందో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కాగా ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పరవాడ సీఐ మల్లికార్జునరావు స్థానిక విలేకరులకు వెల్లడించారు. ప్రమాదం కారణంగా బ్లాక్ పూర్తిగా ధ్వంసమైనట్టు సమాచారం. ప్రమాద జరిగిన సమయంలో అక్కడ పనిచేస్తున్న కొంతమంది కార్మికులు పైపులైన్ల ద్వారా కిందకు దిగి ప్రాణాలు రక్షించుకున్నట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.


కమిషనర్ సత్యనారాయణకు స్వామివారి ఫొటో అందిస్తున్న ఈఓ త్రినాథరావు

అప్పన్నను దర్శించుకున్న దేవదాయ శాఖ కమిషనర్

సింహాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్. సత్యనారాయణ శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆలయ వైదికులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న కమిషనర్ గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు జరిపి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

సంప్రదాయబద్ధంగా తిరు నక్షత్ర పూజలు


పారాయణలు చేస్తున్న వైదికులు

సింహాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విశిష్టాద్వైత మత వ్యాపకులు ఆళ్వార్లలో ఒకరైన మనవాళ మహాములు తిరునక్షత్ర పూజలు వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని భూ, నీలాదేవితో పాటు ఆళ్వార్లతో ఆలయ ఆస్థాన మండపంలోని ప్రత్యేక రజిత వేదికపై అధిష్ఠింపజేశారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత స్థానాచార్యులు రాజగోపాల్ సారథ్యంలో అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని నాలుగు వేల పాశురాల పారాయణకు శ్రీకారం చుట్టి మూడు గంటల పాటు పఠించారు. మధ్యాహ్నం రాజభోగం వేళ మంగళశాసనం సమర్పించి తొలిరోజు కార్యక్రమాన్ని ముగించారు. కాగా తిరు నక్షత్ర పూజల సందర్భంగా ఈనెల 6వ తేదీ వరకు స్వామివారి సన్నిధిలో జరగాల్సిన ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

భీమిలిలో మహా నారాయణ సేవ ప్రారంభం

భీమునిపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న మహా నారాయణ సేవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ శనివారం ప్రారంభించారు. ముందుగా బీచ్‌రోడ్‌లో వున్న అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు, ప్రధాన కార్యదర్శి మొకర నరసింగరావు మాట్లాడుతూ వచ్చే నెల 16 వరకూ మాలలు వేసిన వారికి నిత్య అన్నదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి, 3వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గొలగాని నరేంద్రకుమార్, తెలుగు యువత అధ్యక్షుడు కనకల అప్పలనాయుడు, యార్లగడ్డ జీవన్‌కుమార్, పట్టణ వైసీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

... 5వ పేజీ తరువాయి

తానెక్కడా చూడాలని ఈ సందర్భంగా చంద్రబాబు పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

తెలుగుదేశం పార్టీకి ఆదర్శవంతమైన కార్యకర్తలుండే జిల్లా విశాఖ అని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ జిల్లాను టీడీపీకి కంచుకోటగా నిలబెట్టారని, పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలోనూ కార్పొరేటర్లను గెలిపించారని ఒకింత చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లోనూ ఎంపీ, ఎమ్మెల్యేలకు పార్టీ మెజారిటీలను అందించి పెట్టారన్నారు.పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలు గురించి తాను ఆలోచిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యకర్తలను ఎలా ఆదుకోవాలనే దానిపై స్పష్టతతో ఉన్నానని వివరించారు. పార్టీ కోసం పనిచేసిన అందరికీ తాను పదవులు ఇవ్వలేకపోయినప్పటికీ మంచి భవిష్యత్తును అందిస్తానని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. పాలనలో భాగస్వామ్యం కల్పిస్తామని వెల్లడించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను ఆర్థికంగా పైకి తీసుకువచ్చే అవకాశాలపై దృష్టి సారిస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ఐదు లక్ష రూపాయలు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్టు తెలిపారు.గతంలో రూ.రెండు లక్షలు ఉండగా, దాన్ని రూ.ఐదు లక్షలకు పెంచినట్టు తెలిపారు. అలాగే, పార్టీ తరఫున మట్టి ఖర్చులకు పది వేలు అందిస్తున్నామని, పిల్లలు చదువులకు సాయం చేస్తున్నట్టు వెల్లడించారు. పార్టీ పటిష్టంగా ఉండాలంటే సభ్యత్వం చాలా కీలకమని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని సూచించారు. సభ్యత్వాలు పూర్తయిన తరువాత కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పటిష్టమైన విధానాన్ని ఇందుకోసం అవలంబించనున్నట్టు వెల్లడించారు. కమిటీలు నియమించిన తరువాత ఎమ్మెల్యేలు, మంత్రులు ఆ కమిటీలు సూచించిన పనులు చేసేలా దిశానిర్దేశం చేస్తామని స్పష్టంచేశారు. ఆలస్యమైనప్పటికీ కార్యకర్తలను కలిసి వెళ్లాలన్న ఉద్దేశంతోనే కార్యాలయానికి వచ్చినట్టు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల నుంచి వినతులను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల విద్యార్థుల ఆందోళన

భీమునిపట్నం (రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మహారాజుపేట కూడలి వద్ద ఉన్న ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ వైఖరి పట్ల శనివారం రాత్రి ఆందోళన చేశారు. కళాశాల సిబ్బందిని తరగతి గదిలో ఉంచి, తమ సమస్యను పరిష్కరించేవరకు బయటకు వెళ్లకుండా అడ్డగించారు. కళాశాలలో నాలుగేళ్ల ఫార్మసీ కోర్సును ఈఏడాది పూర్తి చేసుకున్న విద్యార్థులు గతనెల 21 నుంచి 28 వరకు పరీక్షలకు హాజరయ్యారు. 12 మంది విద్యార్థినులు, నలుగురు విద్యార్థుల ఇంటర్నెల్ మార్కుల విషయంలో వారికి కేటాయించిన గైడ్‌లను (పర్యవేక్షకులు)లను ప్రిన్సిపాల్ తొలగించడంతో విద్యార్థులు ఇంటర్నెల్ మార్కులు పొందలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు శనివారం సాయంత్రం కళాశాలకు చేరుకుని సిబ్బందిని నిలదీశారు. వారికి మద్దతుగా మిగిలిన విద్యార్థులు కూడా వచ్చారు. అంతా కలిసి ప్రిన్సిపాల్ వైఖరిని తప్పుపడుతూ నినాదాలు చేశారు. వారికి తెలియకుండా ప్రిన్సిపాల్ రాజానంద స్వామి బయటకు వెళ్లిపోయి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రాజెక్టు మార్కులు వేయకపోతే తమకు ఒక ఏడాది వృథా అయిపోతుందని విద్యార్థులు తెలిపారు. తమ సంగతి తేల్చే వరకు సిబ్బందిని బయటకు వెళ్లనీయమని తరగతి గది ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు రాత్రి 8 గంటల సమయంలో వచ్చి విద్యార్థులతో చర్చలు జరిపారు. వారిని ఆటోలు, బస్సుల్లో ఎక్కించి ఇళ్లకు పంపించారు. ఈ విషయాన్ని విద్యా శాఖాధికారులకు తెలియజేయాలని కళాశాల సిబ్బందికి పోలీసులు సూచించారు.

ఈనెలలో అప్పన్న ఆలయంలో ఉత్సవాలు

సింహాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెలలో పలు ఆధ్యాత్మిక ఉత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 3న స్వర్ణ సంపెంగల పూజ, 6న తిరు నక్షత్ర పూజలు, 7న స్వర్ణ పుష్పార్చన, శ్రీసేన మొదలియార్ తిరు నక్షత్ర పూజలు, 8న సింహవల్లీ తాయర్ సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సాయంత్రం ఆలయ బేడా మండపంలో ఆండాళ్ తిరునక్షత్ర తిరువీధి, 9న శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని కొండదిగువ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీసుదర్శన హవనం, 10న స్వర్ణ పుష్పార్చన, పెరియాళ్వార్ తిరునక్షత్ర పూజ, 12న కార్తీక శుక్లపక్ష ఏకాదశి సందర్భంగా స్వర్ణ తులసీ దళార్చన, కైశిక పురాణ విన్నపం, రాత్రి ధూపసేవానంతరం గ్రామ తిరువీధి, 13న చిలుకు ద్వాదశి, క్షీరాబ్ధి ద్వాదశి, బేడా తిరువీధి, 14న స్వామివారి మాస జయంతి, గ్రామ తిరువీధి జరగనున్నాయి. అలాగే 15న కార్తీక పూర్ణిమ పురస్కరించుకుని సాయంత్రం తాయార్ల బేడా తిరువీధి, 17న వృశ్చిక సంక్రమణం, గ్రామ తిరువీధి, రోహిణి నక్షత్రం సందర్భంగా మాధవధారలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీఅష్టాక్షరీ హవనం, 19న ఆర్ద్ర ఎంబెరుమన్నారు తిరునక్షత్రం, 20న పునర్వసు నక్షత్రం పట్టాభిషేక సర్గవిన్నపం, సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ, శ్రీరామ షడక్షరీ హవనం, 24న పుబ్బ నక్షత్రం ఆండాళ్ మాస తిరునక్షత్ర పూజలు, 26న కార్తీక బహుళపక్ష ఏకాదశి పురస్కరించుకుని తులసీ దళార్చన, గ్రామ తిరువీధి,29న స్వాతి నక్షత్ర హవనం, 30న విశాఖ నక్షత్రం నమ్మాళ్వార్ తిరు నక్షత్ర పూజలు జరగనున్నాయి.

విశాఖకు ఔటర్ రింగ్

... 5వ పేజీ తరువాయి

అధ్యయనం జరగాలన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో భాగంగా 2026లో భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుందని, అప్పటికి అన్ని అభివృద్ధి ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఉండాలని, లిక్విడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అందుబాటులోకి తేవాలని సూచించారు. అరకు కాఫీ, మిరియాలు, పసుపులకు మరింత బ్రాండింగ్, మార్కెటింగ్ చేయాలన్నారు. విశాఖ నగర అవసరాలు తీరే విధంగా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పంటలు సాగు చేయించాలని అధికారులకు సూచించారు. గోదావరి నీటిని తీసుకురావడం ద్వారా నగర తాగునీటి కష్టాలు తీరతాయన్నారు. సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంట్లో 200 యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరగాలన్నారు. టాటా, జీఎంఆర్ సంస్థలను మెంటార్లుగా తీసుకొని ముందుకుసాగాలన్నారు. యువత ఉద్యోగాలు సాధించే విధంగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. లాజిస్టిక్స్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, పోర్టుల అనుసంధానం చేయాలని సూచించారు. విశాఖ జనాభా ప్రస్తుతం 26 లక్షలని, ఉత్తరాంధ్ర జిల్లాలను కలుపుకొంటే 50 లక్షలు ఉంటుందని, ఈ జనాభా కోటికి పెరగాలన్నారు.

అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలి

జిల్లాల్లో అధికారులు చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు. సింహాచలం పంచ గ్రామాల సమస్య చాలాకాలంగా పరిష్కారం కాకుండా ఉండిపోయిందని, దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూములు చూడాలని ఆదేశించారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి గురించి ప్రస్తావించగా, దానికి భూ సేకరణ సమస్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమైంది. అలాకాకుండా పరవాడ నుంచి కొండకర్ల ఆవ మీదుగా ఏపీఐఐసీ సెజ్‌కు గ్రీన్‌ఫీల్డ్ రహదారి వేసుకోవచ్చునని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించగా, అది పీపీపీలో చేయగలిగితే ముందుకు వెళ్లాలని సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జీవీఎంసీ పరిధిలో అన్న క్యాంటీన్లకు రద్దీ ఎక్కువగా ఉంటున్నదని కమిషనర్ సంపత్‌కుమార్ వివరించగా, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చేందుకు అవసరమైన మార్పులు చేయాలని ఆదేశించారు. విశాఖలో ఇసుక అమ్మకాలపై చర్చ రాగా గతంలో టన్ను రూ.1,390కు ఇచ్చేవారని, ఇప్పుడు రూ.1,200కు ఇస్తున్నామని కలెక్టర్ వివరించారు. గ్రేహౌండ్స్ భూములు ఖాళీగా ఉన్నందున హోటళ్ల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. సంక్రాంతి తరువాత ఎక్కడైనా గుంతలు కనిపించినా, ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారిని సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. నగరంలో రౌడీయిజం లేకుండా చూడాలని, సీసీ టీవీ కెమెరాల సంఖ్య ఇంకా పెంచాలని పోలీస్ కమిషనర్‌కు సూచించారు. ఎక్కడపడితే అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని, శాస్త్రీయ విధానం అనుసరించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఇప్పటినుంచే పనులు చేపట్టాలన్నారు. అచ్యుతాపురంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అలాగే ఎలమంచిలి ప్రాంతంతో ఫర్నీచర్ పార్కు ఏర్పాటు చేయాలని సుందరపు విజయకుమార్ కోరగా, మాడుగులలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే బండారు కోరారు. అల్లూరి జిల్లాలో విద్యా విధానం మెరుగుపడాలని సీఎం ఆదేశించారు. డోలీమోతలు ఉండకూడదని, గిరిజన యువతకు గైడ్లుగా శిక్షణ ఇచ్చి పర్యాటక ప్రాంతాల్లో ఉపయోగించుకోవాలన్నారు.

విశాఖ అంటే ప్రత్యేక అభిమానం

విశాఖపట్నం అంటే తనకు ప్రత్యేక అభిమానం అని, ఈ నగరానికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. విశాఖ ప్రజలకు విజ్ఞత ఎక్కువని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో అది మరింత ప్రస్ఫుటం అయిందన్నారు. నీతి, నిజాయితీగా ఉంటారన్నారు. సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, నారాయణ, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్, డోలా బాలాంజనేయ స్వామి, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, గొల్ల బాబూరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, దినేశ్‌కుమార్, విజయకృష్ణన్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, మూడు జిల్లాల జాయింట్ కలెక్టర్లు పాల్గొన్నారు.

రూ.11,500 కోట్లతో మెట్రో మొదటి దశ

... 5వ పేజీ తరువాయి

అదనంగా మరో రూ.3 వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల నిధులను దారిమళ్లించిందని ఆరోపించారు. వీఎంఆర్‌డీఏ నుంచి రూ.450 కోట్లు వాడేశారన్నారు. అలాగే ప్రజలు మునిసిపాలిటీలకు నీటి పన్ను, ఇంటి పన్ను, భవన నిర్మాణ ఫీజులు కింద రూ.3,200 కోట్లు చెల్లిస్తే వాటిని కూడా దారిమళ్లించారని మంత్రి నారాయణ ఆరోపించారు. సీఎం చంద్రబాబునాయుడు వాటిని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు ఇవ్వాలని, గుంతలు లేని రహదారులు, వంద శాతం వీధి దీపాలు వెలిగేలా చూస్తున్నామని చెప్పారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించే ప్రయత్నం జరుగుతోందన్నారు. విశాఖను ఆర్థిక నగరంగా మార్చడానికి పర్యాటకం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టామని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఒక్క విశాఖలోనే 25 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించామన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖలో 95 శాతం వీధిదీపాలు వెలిగేలా చేశామన్నారు. ఇంకో రెండేళ్లలో పాలనలో స్పష్టమైన మార్పు కనిపిస్తుందన్నారు.

ఎమ్మెల్యేలను పిలవకుండానే సమీక్ష

వీఎంఆర్‌డీఏలో మెట్రో రైలు, పురపాలక శాఖపై మంత్రులు నిర్వహించిన సమీక్షకు జిల్లాలో ఎమ్మెల్యేలను ఎవరినీ ఆహ్వానించలేదు. దీనిపై వారంతా అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సీఎం వచ్చిన సమయంలో సమీక్ష నిర్వహించి, విశాఖ జిల్లా సమస్యలపై మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, కనీసం దేని గురించి సమావేశం పెట్టారో కూడా చెప్పలేదంటున్నారు.

సంక్షిప్తంగా..

పార్కుల్లో ప్రవేశానికి టికెట్ల ధరలు ఖరారు

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ముడసర్లోవ పార్కు ప్రవేశానికి జీవీఎంసీ టికెట్ రేట్లను నిర్ధారించింది. పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5 చొప్పున ఉంటుంది. జూ పార్కు ప్రవేశ టిక్కెటు పెద్దలకు రూ.70, చిన్నవారికి రూ.30, బ్యాటరీ కారుకి పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30 చొప్పున నిర్ణయించారు. కారుకు రూ.700, లోపల ఉన్న డ్రైవర్‌తో పాటు ప్రతి ఒక్కరికి రూ.70, పిల్లలకు రూ.30 నిర్ణయించారు. అలాగే కంబాల కొండ లో ప్రవేశ టిక్కెటు పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.20 చొప్పున ఉంటుంది.

5న జూ పార్కులో పూజలకు అనుమతి

ఆరిలోవ, నవంబరు2 : (ఆంధ్రజ్యోతి) : నాగులచవితి పురష్కరించుకొని నవంబరు 5న (మంగళవారం) జూ పార్కులోకి సాధారణ ప్రవేశం కంటే ముందుగానే అనుమతిస్తున్నట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. ఉదయం 7:30కి తెరచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు. జూలోని పుట్టల్లో పాలుపోసి పూజలు చేసుకోవడానికి అనుమతిస్తున్నట్టు చెప్పారు. బాణసంచా లోపలకు తీసుకు వెళ్లకూడదన్నారు. నిబంధనలు పాటించాలని కోరారు. ఎవరైనా ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

వ్యాసరచన పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కొల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తోటగరువు జిల్లా పరిషత్తు హైస్కూలు విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వ్యాస రచన పోటీలో ప్రథమ బహుమతి ఎం.తనీషా, ద్వితీయ బహుమతి రమాసియి,తృతీయ బహుమతి ఎ.యశస్విని పొందారు. వీరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానీ, టీచర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్ :** మెలోడి, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర :** వెంకటేశ్వర, సంగం, కిన్నెర, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ)
● **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 44, టమాటా 36, వంకాయలు(తెలుపు) 34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 28, పచ్చిమిర్చి 48 కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 44 దొండకాయలు 32, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది) 60, బరబటి 40, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
ఫారం ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

మహిళా సాధికారతే సీఎం లక్ష్యం

» ఎమ్మెల్యే వెలగపూడి


పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

మద్దిలపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చెప్పారు. శివాజీపాలెం రఘురాం గ్యాస్ ఏజెన్సీలో శనివారం ఆయన దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో మొత్తం 75 వేల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 66 వేల మంది దీపం-2 పథకానికి అర్హులుగా ఉన్నారన్నారు. వారందరకీ ఉచిత గ్యాస్ సిలిండర్లతో లబ్ధి చేకూరుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ దశల వారీగా అమలు చేస్తోందన్నారు. సామాజిక పింఛన్లను రూ.వెయ్యి పెంచి ఒకటో తేదీ నుంచి ఠంచనుగా అందిస్తున్నామన్నారు. మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ అమలు చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా ఏడాదికి రూ.2684 కోట్ల బడ్జెట్ భారంతో ఉచిత సిలిండర్లు అందిస్తున్నారంటే చంద్రబాబుకు ప్రజా సంక్షేమం, మహిళా సాధికారితకు ఎంత చిత్తశుద్ధితో ఉన్నారో అర్థం చేసుకోవాలన్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు జేఎల్ఎన్ కుమార్ మాట్లాడుతూ గ్యాస్ వినియోగదార్లంతా తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలన్నారు. బ్యాంక్ ఖాతా మొదట పేజీ, ఆధార్ కార్డు, గ్యాస్ వినియోగదారుని బుక్ ఏజెన్సీలో సమర్పించి కేవైసీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బి.వెంకటరమణ, భైరెడ్డి పోతన్నరెడ్డి, కాళ్ల శంకర్, శివారెడ్డి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏవీఆర్


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రావు, పక్కన రామారావు తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా టీడీపీ తూర్పు నియోజకవర్గ నాయకులు అక్కరమాని వెంకట్రావు ఎన్నికయ్యారు.సంఘం గౌరవ అధ్యక్షులు పల్లా సింహాచలం నేతృత్వంలో శనివారం ఆయన నివాసంలో మాజీ అధ్యక్షుడు భరణికాన రామారావు పర్యవేక్షణలో వెంకట్రావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ జిల్లా యాదవ సంక్షేమ సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా పని చేస్తానని, సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గుమ్మడి నర్సింగ్‌రావు, ఎడ్ల సుమన్, అలిసె అప్పలనారాయణ, నక్క కనకరాజు, తోటగరువు యాదవ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒమ్మి చిన్నారావు, గొలగాని ప్రసాద్, నక్క సావిత్ర ప్రసాదాల భాగ్యానంద్, బమ్మిడి ఎల్లాజీ, సారిపల్లి రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


గోవర్ధన పూజ నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిపారవశ్యంతో గోవర్ధన పూజ

» మార్మోగిన హరేరామ హరేకృష్ణ నామస్మరణ

ఎంవీపీ కాలనీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించిన గోపూజ, గోవర్ధన పూజ భక్తులను భక్తి, ఆధ్యాత్మిక భావనలతో ఓలలాడించింది. పరిసరాలు హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో మార్మోగాయి. సాయంత్రం 6 గంటలకు గోపూజ నిర్వహించారు. అనంతరం గోవర్ధన పూజ, దామోదర హారతి, శ్రీకృష్ణునికి నెయ్యి దీపాల అర్పన, ప్రసాద స్వీకరణ నిర్వహించారు. గోవర్ధన పూజ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో తయారు చేసిన 25 కిలోల కేకు, రాగిలడ్డు, అరిసెలు, రవ్వలడ్డు, చేగోడీలు, కొబ్బరి లడ్డూలు, సంపంగి రేకులు, పంచదార అరిసెలు, కోవా, నువ్వుండలు వంటి 108 రకాలు ప్రసాదంగా పంచి పెట్టారు. గోవర్ధన గిరి నమూనా చుట్టూ పరిక్రమ నిర్వహించారు. గోమాతకు పూజలు చేశారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ నిష్కించిన భక్తదాస ఆధ్యాత్మిక అంశాలను ప్రబోధించారు. ఈ నెల 27 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకూ గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠం మందిర నిర్మాణ ప్రదేశంలో లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్టు భక్తదాస తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.


ప్రసాదంగా తయారు చేసిన మిఠాయిలు

ముడసర్లోవ పార్కులో శుభ్రత పనులు


పార్కులో సహజసిద్ధంగా ఉన్న ఓ పుట్ట

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగులచవితి నేపథ్యంలో ముడసర్లోవ పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ పార్కులో పదుల సంఖ్యలో సహజసిద్ధమైన పుట్టలు ఉండడంతో నాగులచవితి రోజు పాలు పోసి పూజలు చేసేందుకు అధికంగా భక్తులు ఈ పార్కుకు తరలి వస్తారు. ఆదివారం నుంచి కార్తీక మాసం మొదలు కావడంతో కొందరు ఈ నెలలో రోజూ పుట్ట వద్దకు వచ్చి పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడ శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పుట్టల వద్ద, పరిసరాల్లో దట్టంగా పెరిగిన పొదలను తొలగిస్తున్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

» అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ శనివారం ఒక ప్రకటనలో కోరారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి వంశధార, నాగావళి నదులపై ప్రాజెక్టులు, ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వంటివి అవసరమని, ఎన్డీఏ ప్రభుత్వమే ఒడిశాలో ఉంది కాబట్టి ఆ రాష్ట్రానికి ఉన్న అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించి వంశధారపై నేరడి ప్రాజెక్టుతో సహా పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులన్నింటినీ పూరిచేయాలని విజ్ఞప్తి చేశారు. భావనపాడు ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేయాలని, పలాస కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌లలో శాశ్వత ఉద్యోగులను నియమించడంతో పాటు వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో సమకూర్చాలన్నారు.అంబేద్కర్ యూనివర్సిటీ, ఐఐటీలో అధ్యాపకులను, సిబ్బందిని నియమించాలని, కొవ్వాడలో అణు విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపి వేయాలని, జీడి రైతులకు గిట్టుబాటు కల్పించాలని కోరారు. నవంబరు ఒకటిన రాష్ట్రావతరణ దినోత్సవాన్ని జరపకపోవడం దురదృష్టకరమని అజశర్మ పేర్కొన్నారు.

సీఏ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

» పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి


సమావేశంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. పిఠాపురం కాలనీ ఐసీఏఐ భవనంలో శనివారం నిర్వహించిన బ్రాంచ్ లెవల్ సీఏ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉద్యోగ వ్యాపారం ఏదైనా ఆర్థిక లావాదేవీల్లో ట్యాక్స్ అనేది చాలా కీలకమని, ట్యాక్స్ చెల్లింపులకు కచ్చితంగా సీఏలు అవసరమని గుర్తు చేశారు. పన్నుల చెల్లింపు అనేది దేశ పురోగతికి దోహదపడుతుందన్నారు. ఈ పన్నులు చెల్లించడంలో సీఏలదే కీలక పాత్ర అన్నారు. సీఏలు ఎంతో ఓర్పు, సహనం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ నిర్వాహకులు అనిర్బాన్ పాల్, లోకేష్‌విద్యార్థి, ఉజ్వల, కె.లావణ్య, కె.పుష్పక్, కె.సంపత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

‘మానెటరీ మేనేజ్‌మెంట్’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య నరసింహారావు

వెంకోజీపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు పర్యవేక్షణలో విభాగ పరిశోధకుడు కేటీఎస్ఎస్ సత్యనారాయణ రాసిన ‘మానెటరీ మేనేజ్‌మెంట్’ పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ పుస్తకం ఆర్థిక వ్యవస్థలో డబ్బు నిర్వహణ , లక్ష్యాలు, విధానాలు, వ్యూహాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు రూపొందించబడిందని, డబ్బు సరఫరా నియంత్రణ, వడ్డీ రేట్ల నియంత్రణ, కేంద్ర బ్యాంకు విధానాలు వంటి అంశాలు ఇందులో చర్చించబడ్డాయని పరిశోధకుడు సత్యనారాయణ తెలిపారు. మానెటరీ చర్యల ప్రభావం వివిధ ఆర్థిక రంగాలపై ఎలా ఉంటుందో స్పష్టంగా వివరించడమే ఈ పుస్తకమన్నారు.ఎంబీఏ, ఎంకాం విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి విలువైన గ్రంథంగా ఉపయోగపడుతుందన్నారు. పాఠకులకు ఆర్థిక అంశాలపై లోతైన అవగాహనను కల్పించడం రచయితల ప్రధాన లక్ష్యంగా ఉందన్నారు.

ప్రజల పక్షాన పోరాడితే జైలు పాల్జేస్తారా?

» ప్రజా సంఘాల నేతల ధ్వజం

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలబడినందుకే ప్రొఫెసర్ సాయిబాబాను చంపేశారని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు ఎంతో ప్రమాదకరమని నల్సార్ విశ్వవిద్యాలయం ఆచార్యుడుమురళి పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆచార్య జీఎన్ సాయిబాబా స్మృతి సదస్సు నిర్వహించారు. ముందుగా నిర్వాహకులు సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య మురళి ‘మూడు చట్టాలు’ అనే అంశంపై మాట్లాడారు. దేశవ్యాప్తంగా సాయిబాబా ఆరోగ్యం గురించి చర్చ జరిగిన విషయం తెలిసిందేనన్నారు. అధికారంలో ఉండేవారు నియంతల్లా వ్యవహరిస్తే వారి నుంచి కాపాడేందుకు రాజ్యాంగాన్ని అనుసరించే వారికి నిర్బంధం తప్పదన్నారు. సాయిబాబా విడుదల కోసం చట్ట ప్రకారం పోరాడిన ఇద్దరు ప్రొఫెసర్లు జైల్లో ఉన్నారని గుర్తు చేశారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 90 శాతం అంగవైకల్యం ఉన్న ప్రొఫెసర్ సాయిబాబా పట్ల కోర్టులు వ్యవహరించిన తీరు సరిగా లేదని విమర్శించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన నిలబడినందుకే ప్రొఫెసర్ సాయిబాబాను కేంద్రంలోని మనువాద ప్రభుత్వం చంపేసిందని ధ్వజమెత్తారు. విరసం నేత కృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, సీఎంఎస్ లలిత, భారత నాస్తిక సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

త్వరలో స్పోర్ట్స్ పాలసీ : ‘శాప్’ చైర్మన్


శాప్ చైర్మన్ రవినాయుడును కలిసిన క్రీడా సంఘాల ప్రతినిధులు

పెదవాల్తేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు ప్రయోజనకరంగా త్వరలో స్పోర్ట్స్ పాలసీ ప్రకటించనున్నట్టు ఏపీ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. శనివారం విశాఖ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనను పలు క్రీడా అసోసియేషన్ల నిర్వాహకులు కలిశారు. ఈ సందర్భంగా రవినాయుడు క్రీడారంగం, అసోసియేషన్ల నిర్వహణపై సమీక్ష నిర్వహించి, పలు అసోసియేషన్ల నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో పరిపాలన, మౌలిక వసతుల కల్పన, అసోసియేషన్ల పాత్రపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. క్రీడాకారులు, కోచ్‌లు, అసోసియేషన్లకు అందుబాటులో శాప్ అధికార యంత్రాంగం ఉంటుందన్నారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీల్లోనూ ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహణ క్రీడా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం


అఖండ జ్యోతి వెలిగిస్తున్న గ్రామస్థులు, ఏయూ మాజీ వీసీ జీఎస్ఎన్ రాజు

వెంకోజీపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం, శ్రీ గౌరీజ్ఞానలింగేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలు శనివారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఏయూ మాజీ వీసీ జీఎస్ఎన్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని, దేవస్థానం సభ్యులు, గ్రామ సేవా సంఘం కార్యవర్గం, సభ్యులు స్థానిక భక్తులతో కలిసి అఖండ జ్యోతిని వెలిగించి కార్తీక మాసోత్సవాలు ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాశ్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మలు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశజ్యోతిని గ్రామ సేవా సంఘం సభ్యులు ప్రారంభించారు. నెల రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం పూజలు, సాయంత్రం ఆకాశజ్యోతిని వెలిగించనున్నట్టు అర్చకులు తెలిపారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలాతోరణం నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, కె.పోలినాయుడు, మాజీ అధ్యక్షుడు మద్దాల వీర వెంకటఅప్పారావు, ఎస్.నరసింహారెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ, కేఆర్ఎం కాలనీలలోనిశివాలయాల్లో కార్తీక మాసోత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఎంఎంటీసీ కాలనీలో త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ, కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, పాత వెంకోజీపాలెం శ్రీసీతారామాలయంలోనూ ఉన్న ధ్వజస్తంభాల వద్ద కార్తీక మాసం పురస్కరించుకుని ఆకాశజ్యోతులను వెలిగించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విస్తృత ఉపాధి అవకాశాలు

» ఏయూ వీసీ శశిభూషణరావు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడం ద్వారా యువత భారీ వేతనాలతో ఉపాధి అవకాశాలను సాధించవచ్చని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. శనివారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐఈఈఈ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సును ఆయన ప్రారంభించారు. ఐఈఈఈ వైజాగ్ బే సెక్షన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్‌కాన్ఫరెన్స్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ స్మార్ట్ అండ్ గ్రీన్ టెక్నాలజీస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రానున్న కాలంలో 85 శాతానికి పైగా అకేషన్స్‌లో ఏఐ, ఎంఎల్ తదతర సాంకేతికతలను వినియోగించడం జరుగుతుందన్నారు. రూ.160 దేశాలతో 4.6 లక్షల మంది సభ్యులను కలిగి అతి పెద్ద సంస్థగా ఐఈఈఈ నిలుస్తోందని చెప్పారు. నేటి తరం యువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ యువతను అత్యధికంగా కలిగిన దేశంగా భారత్ నిలుస్తోందన్నారు. శాస్త్రీయ ప్రగతిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్సిటీలు పరిశోధనలు, ఆవిష్కరణలకు నిలయాలుగా నిలుస్తాయన్నారు. అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయంగా ఆవిష్కరణలు గణనీయంగా పెంచాలని చెప్పారు. సాంకేతికతను దిగుమతి చేసుకొనే పరిస్థితి నుంచి అభివృద్ధి చేసి ఎగుమతులు చేసే దిశగా భారత్ అడుగులు వేయాలన్నారు.

ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను ఏయూ వీసీ ఆవిష్కరించారు. సదస్సులో సదస్సు జనరల్ ఛైర్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, టీపీసీ ఛైర్ ఆచార్య దీపికారాణి తదితరులు ప్రసంగించారు.

అవినీతికి దూరంగా యువత మెలగాలి

» జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి సత్యనారాయణ



ఆచార్య సత్యనారాయణను సత్కరిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అవినీతికి దూరంగా యువత నడుచుకోవాలని తద్వారా దేశాభివృద్ధి సాధ్యపడుతుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి వై.సత్యనారాయణ అన్నారు. శనివారం ఏయూ విద్యా విభాగంలో విజిలెన్స్ వారోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడారు. అవినీతికి దూరంగా ఉండటం, అవినీతిని ప్రోత్సహించకపోవడం కూడా దేశభక్తిగా నిలుస్తుందని చెప్పారు. నిజాయితీతో మెలగడం వల్ల దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. విద్యావిభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు మాట్లాడుతూ భవిష్యత్తు తరానికి మార్గదర్శనం చేసే ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడే వారంతా నిజాయితీ, సచ్ఛీలతతో నడుచుకోవాలని సూచించారు. ఏయూ జర్నలిజం విభాగం ఆచార్యులు, మీడియా రిలేషన్స్ డైరెక్టర్ చల్లా రామకృష్ణ మాట్లాడుతూ అవినీతిపై పోరాటాన్ని ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి చేయనని ప్రతి వ్యక్తి అనుకోవడమే కాకుండా ఆచరణలో పెట్టాలన్నారు. అప్పుడే దేశప్రగతి సాధ్యమవుతుదన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యావిభాగం అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నిజాయితీతో మెలగాలి

» ఏసీబీ అధికారులు శ్రీనివాస్, లక్ష్మణరావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న అవినీతినిరోధక శాఖ అధికారులు

మద్దిలపాలెం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి నిజాయితీతో మెలగాలని, అప్పుడే ఉన్నత ఉద్యోగాలు పొందినపుడు ప్రజలకు నిస్వార్థ సేవలు అందించగలరని ఏసీబీ అధికారులు పి.శ్రీనివాస్, లక్ష్మణరావు పేర్కొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వడిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల్లో వారు మాట్లాడుతూ నిజాయితీ మనిషికి గౌరవాన్ని తెచ్చిపెడుతుందన్నారు. సమాజంలో వివిధ విభాగాల్లో అవినీతి పేరుకుపోయిందన్నారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేస్తున్నా ఎక్కడో ఒక దగ్గర లంచమనే మాట వినిపిస్తూనే ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగి అవినీతి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ ఐఏఎస్ఈ ప్రాంగణంలో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజ్ కుమారి, అధ్యాపకులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో ఐఏఎస్ఈ ప్రాంగణంలో ప్రతి శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ వారం ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజ్ కుమారి అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాల్లోని చెత్త చెదారాలను తొలగించారు.

హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ జాం



ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌లో శనివారం సాయంత్రం ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. వెంకోజీపాలెం నుంచి హనుమంతవాక జంక్షన్ సిగ్నల్ పాయింట్ వరకు వాహనాలు కదలడం కష్టమైంది. సాధారణంగా ఈ జంక్షన్ నుంచి వెంకోజీపాలెం వెళ్లేందుకు సుమారు ఐదు నిమిషాలు పడుతుంది. శనివారం సాయంత్రం ఏడు గంటలలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

సీఎంను కలిసిన నజీర్



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించిన నజీర్

మహారాణిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరానికి శనివారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ముస్లిం మైనారిటీ నాయకుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లా కలెక్టరేట్ వద్ద తనను కలిసిన నజీర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

విశాఖ క్రీడా శిక్షకుడికి అరుదైన గౌరవం



శివగిరి

అక్కయ్యపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి 10 వరకూ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగే జాతీయ పాఠశాలల వాలీబాల్ పోటీలకు రిఫరీగా విశాఖ వాసి వనమాడి శివగిరికి ప్రత్యేక ఆహ్వానం అందింది. 68వ జాతీయ పాఠశాల వాలీబాల్ పోటీల నిర్వాహక కార్యదర్శి రాకేష్ కుమార్ నుంచి ఈ ప్రత్యేక ఆహ్వానం అందింది. శివగిరి ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో క్రీడా శిక్షకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఘాట్ రోడ్డు గేటు నిర్మాణాన్ని అడ్డుకున్న వైసీపీ నాయకుడు

జగదాంబ కూడలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ శ్రీసత్యనారాయణ స్వామి ఘాట్ రోడ్డు మార్గం వద్ద గేటు నిర్మాణ పనులను 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ భర్త, వైసీపీ నాయకుడు మాసిపోగు రాజు అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ అనుచర వర్గంగా వారు ముద్రపడ్డారు. ఇసుకకొండ సత్యనారాయణ స్వామి గుడికి ఇటీవల ఘాట్ రోడ్డు నిర్మించారు. రాత్రి సమయంలో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడంతో ఆలయ అధికారులు ఘాట్ రోడ్డు ప్రధాన మార్గం వద్ద ఇనుపగేటు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న మాసిపోగు రాజు శుక్రవారం అక్కడకు వెళ్లి పనులు అడ్డుకున్నట్టు ఆలయ సిబ్బంది తెలిపారు. కూటమి అధికారంలో ఉన్నా వైసీపీ నాయకుడి హవా ఏమిటన్న ప్రశ్న వినిపిస్తోంది. గేటు నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

12న బల్లిగిరిలో ప్రత్యేక పూజలు

అల్లిపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా నగరంలోని వెంకటేశ్వరమెట్ట బల్లిగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈఓ జీవీ రమాబాయి తెలిపారు. ఆ రోజు తెల్లవారు జామున 4 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి సహస్ర నామార్చన జరుగుతుందన్నారు. పూజలో పాల్గొనేందుకు టిక్కెట్ రుసుము రూ.50లుగా నిర్ణయించామన్నారు. కార్తీక మాసం సందర్భంగా రోజూ విశేషపూజలు జరుగుతాయని భక్తులు గమనించాలని కోరారు.

5న జూ పార్కులో పూజలకు అనుమతి

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పురస్కరించుకొని నవంబరు 5న (మంగళవారం) జూ పార్కులోకి సాధారణ ప్రవేశం కంటే ముందుగానే అనుమతిస్తున్నట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. ఉదయం 7:30కి తెరచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు. జూలోని పుట్టల్లో పాలుపోసి పూజలు చేసుకోవడానికి అనుమతిస్తున్నట్టు చెప్పారు. బాణసంచా లోపలకు తీసుకు వెళ్లకూడదన్నారు. పెద్దలకు ఒక్కొక్కరికి రూ.70, పిల్లలకు రూ.30 టికెట్ ఉంటుందన్నారు.

శాప్ చైర్మన్ దృష్టికి క్రీడా సమస్యలు



రవినాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తెలుగు యువత ఉపాధ్యక్షుడు మోహన్

అక్కయ్యపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):నగరంలో క్రీడా రంగానికి మౌలిక వసతులు కల్పించాలని శాప్ చైర్మన్ అమ్మి రవినాయుడును కోరినట్లు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహన్ తెలిపారు. శనివారం ఉత్తరాంధ్రకు మొదటిసారి విచ్చేసిన శాప్ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఇక్కడి పరిస్థితులను వివరించానన్నారు.

ఇరుకు గదుల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



అక్కయ్యపాలెం విద్యుత్‌నగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



ఒకే గదిలో పెట్టిన అన్ని రకాల మందులు

అక్కయ్యపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం పరిధి గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని విద్యుత్‌నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఇరుకు గదుల్లో కొనసాగుతోంది. ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందేందుకు పరిసర ప్రాంతాల నుంచి గణనీయంగా వస్తుంటారు. ఇక్కడికి సరఫరా అయిన మందులను ఎక్కడ భద్రపరచాలో తెలియని స్థితి నెలకొంటోందని సిబ్బంది చెబుతున్నారు. ఆసుపత్రికి వచ్చిన మందుల నిల్వ మొత్తం ఒకే గదిలో పేర్చాల్సి వస్తోందంటున్నారు. ఈ ఆసుపత్రికి ఔట్ పేషెంట్లు అధిక సంఖ్యలో వస్తున్నారు. వారికి అందించాల్సిన మందులను ఇండెంట్ పెట్టిన తర్వాత స్టాక్ వస్తుంది. వాటిని పెట్టడానికి ప్రత్యేక గదులు లేకపోవడంతో ఉన్న ఇరుకు గదుల్లోనే సర్దిపెడుతున్నారు. ఈ ఆసుపత్రిలో 43 రకాల రోగనిర్ధారణ పరీక్షలు, వివిధ రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో ఒక వైద్యుడు (మెడికల్ ఆఫీసర్), ఫార్మసిస్టు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్ సేవలందిస్తున్నారు. గర్భిణులకు టీకాలు, సమయసారిణి అనుసరించడం, టీబీ నివారణకు టీకాలు ఇచ్చే కార్యక్రమం ఆరుబయటనే చేపడుతున్నారు. వైద్యుడి గది మినహా మిగిలిన రెండు, మూడు గదుల్లో ఇరుకిరుకుగా ఉంటున్నాయి. రోగులు గుమిగూడుతున్నారు. లోపలకు ఒకరి తరువాత ఇంకొకరు వెళ్లాల్సి వస్తున్నందున అంతవరకు ఆరుబయటనే నిరీక్షించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మందులు పెట్టేందుకు అదనపు గదులు నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు.

రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములవుదాం

- జనసైనికులకు మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపు
- పార్టీలో అందరికీ న్యాయం జరిగేటట్లు కృషి చేస్తాం



జనసేన కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

సీతంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయ సాధన కోసం, రాష్ట్ర నిర్మాణం కోసం మనమంతా కలిసి పనిచేద్దామని రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర జనసేన పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజం కోసం నిజాయతీగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే విధంగా అంటే ప్రజలకు మేలు జరిగేలా ఏ కార్యక్రమం చేసినా అది రాజకీయ ప్రయోజనాల కోసం కాదన్నారు. గతంలో జనసేన పార్టీ చేపట్టిన 'గుడ్ మార్నింగ్ సీఎం' ద్వారా ప్రజల కష్టాలు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రోజు కూడా మనమంతా అంకితభావంతో రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములం అవుదామని, ఇది మన బాధ్యత అన్నారు. పదవులు ఎవరికి వచ్చినా, రాకపోయినా మనమంతా పనిచేసేది ఒక ఆశయసాధన కోసమన్నారు. దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలో పనిచేసిన ప్రతీ ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, అహర్నిశలు పనిచేసిన మంత్రి మనోహర్ మనందరికీ ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మినేని శివశంకర్ జన్మదిన వేడుకలు నిర్వహించి కేకు కోశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వివిధ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, వివిధ స్థాయిల నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

నగరంలో గుంతల పూడ్చివేతకు శ్రీకారం

జగదాంబ కూడలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారులను గుంతల మయంగా మార్చారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలోని రామకృష్ణా జంక్షన్ వద్ద గుంతల పూడ్చివేత పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నా గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జీవీఎంసీ అధికారులతో చర్చించిన అనంతరం నగరంలో గుంతలు లేని రహదారులుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 35వ వార్డు రామకృష్ణ జంక్షన్‌లో వాహనదారులు వణికిపోయే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీడీపీ దక్షిణ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, చిన్నరహమాన్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కుల్లో ప్రవేశానికి టికెట్ల ధరలు ఖరారు

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేపథ్యంలో ముడసర్లోవ పార్కు ప్రవేశానికి జీవీఎంసీ టికెట్ రేట్లను నిర్ధారించింది. పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5 చొప్పున ఉంటుంది. జూ పార్కు ప్రవేశ టిక్కెటు పెద్దలకు రూ.70, చిన్నవారికి రూ.30, బ్యాటరీ కారుకి పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30 చొప్పున నిర్ణయించారు. కారుకు రూ.700, లోపల ఉన్న డ్రైవర్‌తో పాటు ప్రతి ఒక్కరికి రూ.70, పిల్లలకు రూ.30 నిర్ణయించారు. కంబాల కొండలో ప్రవేశ టిక్కెటు పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.20 చొప్పున ఉంటుంది.

'టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టండి'



కంచరపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వాడవాడలా చురుగ్గా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు 46, 55 వార్డుల నాయకులకు సూచించారు. ఆయా వార్డుల నాయకులు శనివారం పల్లాను కలిసి సభ్యత్వ నమోదు చేపడుతున్న విధానాన్ని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు, అభిమానులకు వివరించాలని పల్లా కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి జోగా మహేష్, బింగి రాజు రెడ్డి, జోగా వెంకటరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు సభ్యత్వ వివరాలు ఇస్తున్న నాయకులు

జానపద కళా ప్రదర్శనకు కమిటీ



సమావేశంలో పాల్గొన్న ఇస్కఫ్ ప్రతినిధులు

సీతంపేట, నవంబరు 2: (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 15న ఏర్పాటు చేయతలపెట్టిన జానపద కళా ప్రదర్శనకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిని ఆహ్వానించాలని కళాకారుల సంఘం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 4న సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇస్కఫ్ ప్రతినిధులు తెలిపారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య బాలమోహన్‌దాస్, టి.ఎన్.సుకుమారన్, దేవరకొండ మార్కెండేయులు, సత్య ఆంజనేయ, మరికొందరు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు. ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయ ఆదాయం రూ.18.36 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

జ్ఞానాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అచ్చియ్యమ్మపేట గ్రామదేవత శ్రీఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలో సెప్టెంబరు 12 నుంచి నవంబరు 2 వరకు భక్తులు వేసిన కానుకలను శనివారం లెక్కించారు. పెందుర్తి వెంకటేశ్వరస్వామి దేవాలయ ఈఓ ఎం.నీలిమా పర్యవేక్షణలో, పోలీసు బందోబస్తుతో గోపాలపట్నం శ్రీహరి సేవా సంఘం సహకారంతో లెక్కించగా మొత్తం రూ.18,36,316 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు.

ప్రజల పక్షాన పోరాడితే జైలు పాల్జేస్తారా?

- కేంద్ర ప్రభుత్వం తీరుపై ప్రజాసంఘాల నేతల ధ్వజం



సదస్సులో ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, వేదికపై ఆచార్య మురళి, చిలకా చంద్రశేఖర్, ఎం.లక్ష్మి తదితరులు

సీతంపేట, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలబడినందుకే ప్రొఫెసర్ సాయిబాబాను చంపేశారని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు ఎంతో ప్రమాదకరమని నల్సార్ విశ్వవిద్యాలయం ఆచార్య మురళి పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆచార్య జి.ఎస్.సాయిబాబా స్మృతి సదస్సు నిర్వహించారు. ముందుగా నిర్వాహకులు ఆచార్య సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య మురళి 'మూడు చట్టాలు' అనే అంశంపై మాట్లాడారు. దేశవ్యాప్తంగా సాయిబాబా ఆరోగ్యం గురించి చర్చ జరిగిన విషయం తెలిసిందేనన్నారు. అధికారంలో ఉండేవారు నియంతల్లా వ్యవహరిస్తే వారి నుంచి కాపాడేందుకు రాజ్యాంగాన్ని అనుసరించే వారికి నిర్బంధం తప్పదన్నారు. సాయిబాబా విడుదల కోసం చట్ట ప్రకారం పోరాడిన ఇద్దరు ప్రొఫెసర్లు జైల్లో ఉన్నారని గుర్తు చేశారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 90 శాతం అంగవైకల్యం ఉన్న ప్రొఫెసర్ సాయిబాబా పట్ల కోర్టులు వ్యవహరించిన తీరు సరిగా లేదని విమర్శించారు. భక్తి ముసుగులో మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు పాల్పడిన డేరా బాబాకు కోర్టులు 17సార్లు పెరోల్ ఇచ్చాయని, కానీ తల్లి మరణించినప్పుడు సాయిబాబాకు పెరోల్ నిరాకరించాయని పేర్కొన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన నిలబడినందుకే ప్రొఫెసర్ సాయిబాబాను కేంద్రంలోని మనువాద ప్రభుత్వం చంపేసిందని ధ్వజమెత్తారు. ఆపరేషన్ కగార్ అంశంపై ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విరసం నేత కృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, సీఎంఎస్ లలిత, భారత నాస్తిక సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, డాక్టర్ కొల్లా రాజమోహన్, న్యాయవాది కెఎస్ చలం తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల ప్రతినిధులు, మేధావులు పాల్గొన్నారు.

మెట్రోకెమ్ ఫార్మాలో పేలుడు

- రియాక్టర్ మ్యాన్‌హోల్ ఓపెన్ కావడంతో ప్రమాదం
- పరుగులు తీసిన కార్మికులు

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ (ఏపీఐ) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో శనివారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ సంఘటనకు సంబంధించి కార్మికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-ఏలో రాత్రి తొమ్మిది గంటలకు రియాక్టర్ మ్యాన్‌హోల్ రసాయనాల ఒత్తిడికి గురై ఓపెన్ అయ్యింది. రసాయనాలు ఒక్కసారిగా బయటకు తుళ్లిపడడంతో మంటలు వ్యాపించాయి. దీంతో బ్లాక్ వద్ద పనిచేస్తున్న కార్మికులంతా భయాందోళనతో అక్కడి నుంచి పరుగులు తీశారు. పేలుడు ధాటికి బ్లాక్‌లోని కిటికీ అద్దాలన్నీ పగిలి పక్కనే ఉన్న రోడ్డుపైకి వచ్చి పడ్డాయి. సుమారు 20 నిమిషాలకు పైగా మంటలు ఎగిసిపడ్డాయి. ముందస్తు చర్యల్లో భాగంగా యాజమాన్యం విద్యుత్ సరఫరాను నిలిపివేసింది. సమాచారం అందుకున్న రాంకీ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేసింది. అయితే ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరికీ గాయాలు కాలేదని హెచ్ఆర్ ప్రతినిధి తేజ స్థానిక విలేకరులకు తెలిపారు. అయితే ప్రమాద తీవ్రత దృష్ట్యా నలుగురు కార్మికులు గాయపడ్డారని, అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారని చెబుతున్నారు. తానాం గ్రామానికి చెందిన పలువురు యువకులు కంపెనీ వద్దకు చేరుకుని యాజమాన్యం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రమాదం ఎలా జరిగిందో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కాగా ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పరవాడ సీఐ మల్లికార్జునరావు స్థానిక విలేకరులకు వెల్లడించారు. ప్రమాదం కారణంగా బ్లాక్ పూర్తిగా ధ్వంసమైనట్టు సమాచారం. ప్రమాద జరిగిన సమయంలో అక్కడ పనిచేస్తున్న కొంతమంది కార్మికులు పైపులైన్ల ద్వారా కిందకు దిగి ప్రాణాలు రక్షించుకున్నట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

విశాఖకు ఔటర్ రింగ్

... 5వ పేజీ తరువాయి

అధ్యయనం జరగాలన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో భాగంగా 2026లో భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుందని, అప్పటికి అన్ని అభివృద్ధి ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఉండాలని, లిక్విడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అందుబాటులోకి తేవాలని సూచించారు. అరకు కాఫీ, మిరియాలు, పసుపులకు మరింత బ్రాండింగ్, మార్కెటింగ్ చేయాలన్నారు. విశాఖ నగర అవసరాలు తీరే విధంగా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పంటలు సాగు చేయించాలని అధికారులకు సూచించారు. గోదావరి నీటిని తీసుకురావడం ద్వారా నగర తాగునీటి కష్టాలు తీరతాయన్నారు. సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంట్లో 200 యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరగాలన్నారు. టాటా, జీఎంఆర్ సంస్థలను మెంటార్లుగా తీసుకొని ముందుకుసాగాలన్నారు. యువత ఉద్యోగాలు సాధించే విధంగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. లాజిస్టిక్స్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, పోర్టుల అనుసంధానం చేయాలని సూచించారు. విశాఖ జనాభా ప్రస్తుతం 26 లక్షలని, ఉత్తరాంధ్ర జిల్లాలను కలుపుకొంటే 50 లక్షలు ఉంటుందని, ఈ జనాభా కోటికి పెరగాలన్నారు.

అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలి

జిల్లాల్లో అధికారులు చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు. సింహాచలం పంచ గ్రామాల సమస్య చాలాకాలంగా పరిష్కారం కాకుండా ఉండిపోయిందని, దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూములు చూడాలని ఆదేశించారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి గురించి ప్రస్తావించగా, దానికి భూ సేకరణ సమస్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమైంది. అలాకాకుండా పరవాడ నుంచి కొండకర్ల ఆవ మీదుగా ఏపీఐఐసీ సెజ్‌కు గ్రీన్‌ఫీల్డ్ రహదారి వేసుకోవచ్చునని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించగా, అది పీపీపీలో చేయగలిగితే ముందుకు వెళ్లాలని సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జీవీఎంసీ పరిధిలో అన్న క్యాంటీన్లకు రద్దీ ఎక్కువగా ఉంటున్నదని కమిషనర్ సంపత్‌కుమార్ వివరించగా, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చేందుకు అవసరమైన మార్పులు చేయాలని ఆదేశించారు. విశాఖలో ఇసుక అమ్మకాలపై చర్చ రాగా గతంలో టన్ను రూ.1,390కు ఇచ్చేవారని, ఇప్పుడు రూ.1,200కు ఇస్తున్నామని కలెక్టర్ వివరించారు. గ్రేహౌండ్స్ భూములు ఖాళీగా ఉన్నందున హోటళ్ల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. సంక్రాంతి తరువాత ఎక్కడైనా గుంతలు కనిపించినా, ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారిని సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. నగరంలో రౌడీయిజం లేకుండా చూడాలని, సీసీ టీవీ కెమెరాల సంఖ్య ఇంకా పెంచాలని పోలీస్ కమిషనర్‌కు సూచించారు. ఎక్కడపడితే అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని, శాస్త్రీయ విధానం అనుసరించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఇప్పటినుంచే పనులు చేపట్టాలన్నారు. అచ్యుతాపురంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అలాగే ఎలమంచిలి ప్రాంతంతో ఫర్నీచర్ పార్కు ఏర్పాటు చేయాలని సుందరపు విజయకుమార్ కోరగా, మాడుగులలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే బండారు కోరారు. అల్లూరి జిల్లాలో విద్యా విధానం మెరుగుపడాలని సీఎం ఆదేశించారు. డోలీమోతలు ఉండకూడదని, గిరిజన యువతకు గైడ్లుగా శిక్షణ ఇచ్చి పర్యాటక ప్రాంతాల్లో ఉపయోగించుకోవాలన్నారు.

విశాఖ అంటే ప్రత్యేక అభిమానం

విశాఖపట్నం అంటే తనకు ప్రత్యేక అభిమానం అని, ఈ నగరానికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. విశాఖ ప్రజలకు విజ్ఞత ఎక్కువని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో అది మరింత ప్రస్ఫుటం అయిందన్నారు. నీతి, నిజాయితీగా ఉంటారన్నారు. సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, నారాయణ, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్, డోలా బాలాంజనేయ స్వామి, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, గొల్ల బాబూరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, దినేశ్‌కుమార్, విజయకృష్ణన్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, మూడు జిల్లాల జాయింట్ కలెక్టర్లు పాల్గొన్నారు.

రూ.11,500 కోట్లతో మెట్రో మొదటి దశ

(5వ పేజీ తరువాయి)

అదనంగా మరో రూ.3 వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల నిధులను దారిమళ్లించిందని ఆరోపించారు. వీఎంఆర్‌డీఏ నుంచి రూ.450 కోట్లు వాడేశారన్నారు. అలాగే ప్రజలు మునిసిపాలిటీలకు నీటి పన్ను, ఇంటి పన్ను, భవన నిర్మాణ ఫీజులు కింద రూ.3,200 కోట్లు చెల్లిస్తే వాటిని కూడా దారిమళ్లించారని మంత్రి నారాయణ ఆరోపించారు. సీఎం చంద్రబాబునాయుడు వాటిని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు ఇవ్వాలని, గుంతలు లేని రహదారులు, వంద శాతం వీధి దీపాలు వెలిగేలా చూస్తున్నామని చెప్పారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించే ప్రయత్నం జరుగుతోందన్నారు. విశాఖను ఆర్థిక నగరంగా మార్చడానికి పర్యాటకం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టామని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఒక్క విశాఖలోనే 25 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించామన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖలో 95 శాతం వీధిదీపాలు వెలిగేలా చేశామన్నారు. ఇంకో రెండేళ్లలో పాలనలో స్పష్టమైన మార్పు కనిపిస్తుందన్నారు.

ఎమ్మెల్యేలను పిలవకుండానే సమీక్ష

వీఎంఆర్‌డీఏలో మెట్రో రైలు, పురపాలక శాఖపై మంత్రులు నిర్వహించిన సమీక్షకు జిల్లాలో ఎమ్మెల్యేలను ఎవరినీ ఆహ్వానించలేదు. దీనిపై వారంతా అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సీఎం వచ్చిన సమయంలో సమీక్ష నిర్వహించి, విశాఖ జిల్లా సమస్యలపై మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, కనీసం దేని గురించి సమావేశం పెట్టారో కూడా చెప్పలేదంటున్నారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

(5వ పేజీ తరువాయి)

తానెక్కడా చూడాలని ఈ సందర్భంగా చంద్రబాబు పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

తెలుగుదేశం పార్టీకి ఆదర్శవంతమైన కార్యకర్తలుండే జిల్లా విశాఖ అని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ జిల్లాను టీడీపీకి కంచుకోటగా నిలబెట్టారని, పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలోనూ కార్పొరేటర్లను గెలిపించారని ఒకింత చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లోనూ ఎంపీ, ఎమ్మెల్యేలకు పార్టీ మెజారిటీలను అందించి పెట్టారన్నారు. పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలు గురించి తాను ఆలోచిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యకర్తలను ఎలా ఆదుకోవాలనే దానిపై స్పష్టతతో ఉన్నానని వివరించారు. పార్టీ కోసం పనిచేసిన అందరికీ తాను పదవులు ఇవ్వలేకపోయినప్పటికీ మంచి భవిష్యత్తును అందిస్తానని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. పాలనలో భాగస్వామ్యం కల్పిస్తామని వెల్లడించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను ఆర్థికంగా పైకి తీసుకువచ్చే అవకాశాలపై దృష్టి సారిస్తామన్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ఐదు లక్ష రూపాయలు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్టు తెలిపారు. గతంలో రూ.రెండు లక్షలు ఉండగా, దాన్ని రూ.ఐదు లక్షలకు పెంచినట్టు తెలిపారు. అలాగే, పార్టీ తరపున మట్టి ఖర్చులకు పది వేలు అందిస్తున్నామని, పిల్లలు చదువులకు సాయం చేస్తున్నట్టు వెల్లడించారు. పార్టీ పటిష్టంగా ఉండాలంటే సభ్యత్వం చాలా కీలకమని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టిసారించాలని సూచించారు. సభ్యత్వాలు పూర్తయిన తరువాత కమిటీలను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. పటిష్టమైన విధానాన్ని ఇందుకోసం అవలంబించనున్నట్టు వెల్లడించారు. కమిటీలు నియమించిన తరువాత ఎమ్మెల్యేలు, మంత్రులు ఆ కమిటీలు సూచించిన పనులు చేసేలా దిశానిర్దేశం చేస్తామని స్పష్టంచేశారు. ఆలస్యమైనప్పటికీ కార్యకర్తలను కలిసి వెళ్లాలన్న ఉద్దేశంతోనే కార్యాలయానికి వచ్చినట్టు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మందేసి బండి నడిపితే కేసులే..

కొరడా ఝుళిపిస్తున్న పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు

పెందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు.పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కేసులు పెరుగుతున్నాయి. ఇటీవల కాలంలో నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధికంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే చోటుచేసుకున్నట్టు పోలీసుల పరిశీలన తేలింది. ఈ నేపథ్యంలో పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు వేపగుంట, సుజాతనగర్, పెందుర్తి కూడలి, పినగాడి జాతీయ రహదారులపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బ్రీత్ ఎన్‌లైజర్ల ద్వారా పరీక్షలు చేస్తూ వాహనదారులు ఎవరైనా మద్యం సేవించినట్టు నిర్ధారణైతే తక్షణమే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. మందుబాబులకు కోర్టులు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, కారులు, జీపులు, ఆటోలు, లారీ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుతున్న వారిలో ఉంటున్నా, వీరిలో లారీలు, ఆటో డ్రైవర్లే అధికంగా ఉంటున్నట్టు తెలుస్తుంది. అదేవిధంగా మద్యం తాగి బైకులు నడుపుతూ పట్టుబడుతున్న వారిలో యువకులు కూడా ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందని పోలీసులు పేర్కొంటున్నారు. దీంతో మత్తు దిగిన తర్వాత యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెబుతున్నారు.



డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చేతివాటం!

ఇదిలా ఉండగా తనిఖీలో భాగంగా పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తున్నారని, డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో అకారణంగా వేధింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాల సీజ్, డ్రైవింగ్ లైసెన్స్, సీ-బుక్ తీసుకుని స్టేషన్‌లో ఉంచడం వంటి సంఘటనలకు పోలీసులు పాల్పడుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అదేవిధంగా డ్రంకెన్ డ్రైవ్‌లో తనిఖీల సమయంలో మందుబాబుల వద్ద పలువురు పోలీసులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మందు తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే కేవలం అందుకు సంబంధించిన కేసుతో సరిపెట్టకుండా లైసెన్స్, సీ-బుక్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి వాటిని కూడా అడుగుతున్నారని, వాటిలో ఏవి లేకున్నా భారీగా జరిమానాలు విధిస్తున్నారని పలువురు వాహనదారులు వాపోతున్నారు. అంతేకాక ట్రాఫిక్ నిబంధనలను పాటించడం లేదంటూ, ఇతర సాకులు చూపుతూ సెల్ ఫోటోలు తీసి ఈ-చలానాలలో బెంబేలెత్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాపోతున్నారు. కాగా పలువురు మందుబాబులు వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు వేగంగా ముందుకు సాగుతూ ప్రమాదార బారినపడుతున్నారు. అయితే డ్రంకెన్ డ్రైవ్ కేసులను తాము నిబంధనల మేరకే నమోదు చేస్తున్నామని పోలీసులు పేర్కొంటున్నారు.



శిథిలమైన సీసీ రోడ్డు, మురుగు కాలువ

శిథిలావస్థలో రోడ్లు, కాలువలు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సింధియా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ కొండవాలు ప్రాంతంలో కాలువలు సీసీ రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కాలువలు పాడైపోవడంతో ఎక్కడికక్కడ మురుగు తిష్ఠ వేయడంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మలేరియా, డెంగ్యూ ప్రబలే ప్రమాదం ఉందని వారు భయాందోళన చెందుతున్నారు. సీసీ రోడ్లు ఛిద్రంగా మారడంతో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉంటుందని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఆయా సమస్యలను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జీతాల కోసం ఉక్కు ఉద్యోగుల నిరీక్షణ

» సెప్టెంబరు నెలకు సంబంధించి సగం జీతమే అందిందని ఆవేదన

» కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వేడుకోలు



ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు నెలలో చివరి తేదీ అయినా 30 లేదా 31 వస్తే చాలు ఉక్కు కర్మాగారం ఉద్యోగులకు జీతాలు బ్యాంకులో జయ అయ్యేవి. ఒకవేళ ఈ రెండు రోజులు కాకపోతే ఒకటో తేదీన కచ్చితంగా వేతనాలు వచ్చేవి. అలాంటిది ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులంతా తమకు ఎప్పుడు జీతలు చెల్లిస్తారా అని ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. గత కొన్ని నెలలుగా ఉక్కు ఉద్యోగులకు రెండు వాయిదాల్లో జీతాలు చెల్లిస్తున్నాయి. కానీ గత నెలలో మాత్రం సెప్టెంబరుకు సంబంధించి ఒక వాయిదా (సగం) మాత్రమే జీతం ఇచ్చారు. మిగతా సగం నెలాఖరులోగా ఇస్తారని ఆశగా ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు నవంబరు నెల వచ్చేసింది. ఈసారి అయినా గత నెలలో ఇవ్వాల్సిన సగం జీతం పాటు అక్టోబరు నెలకు సంబంధించిన మొదటి విడత వేతనం కలిపి ఇస్తారా..? లేక మొత్తం చెల్లింపులు జరుపుతారా అన్నది తెలియక ఉద్యోగులంతా సతమతమవుతున్నారు. ప్రస్తుతం ప్లాంటులోని ప్రతి విభాగంలోనూ ఇదే అంశంపై చర్చ జరుగుతుంది. ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తి తీసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ముడిపదార్థాలను ఉక్కు యాజమాన్యం సమకూర్చాలని వారు కోరుతున్నారు. వేతనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందింది ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



మాతృశ్రీ నగర్, కుంచుమాంబ కాలనీ ఆలయాల్లో పూజలందుకున్న శివయ్య

ఆలయాలకు కార్తీక శోభ

కూర్మన్నపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో శనివారం పారిశ్రామిక ప్రాంతంలోని శివ, వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాతృశ్రీనగర్‌లోని కాశీఅన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వరాలయంలో, రాజీవ్ నగర్, వడ్లపూడి, కణితి, సంతమామిడి తోట, తెలుకల వీధిచ శ్రీనగర్‌లలోని శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు, అర్చనలు, అభిషేకాలలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం కార్తీక పురాణ శ్రవణం, లింగాష్టకం, బిల్వాష్టకం, భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 70వ వార్డు చట్టివానిపాలెంలో శ్రీబాలాత్రిపురాసుందరి అమృత లింగేశ్వరస్వామి శివాలయంలో అర్చకులు పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలతో శివునికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని వెండి నాగాభరణం, ఇతర ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి పూజలు జరిపారు. ఆటోనగర్‌లోని దుర్గా మల్లికార్జునస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వెంకటాద్రిపై కొలువుదీరిన వైకుంఠ వేంకటేశ్వరస్వామికి కార్తీక మొదటి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి సుప్రభాత సేవలు చేశాక అభిషేకాలు జరిపి, తులసిమాలలతో అలంకరించారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్న సమారాధన చేపట్టారు. ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, సేవా కమిటీ సభ్యులు సాలాపు రామారావు, అనూరాధ తదితరులు పాల్గొన్నారు. కాగా నెల్లిముక్కు ఆలయాల సముదాయంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, ఇంటక్ నాయకుడు గొందేశి మహేశ్వరరెడ్డి, ఆలయ ధర్మకర్త ఎం.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: అగనంపూడి, పరిసర ప్రాంతల్లో గల పలు ఆలయాల్లో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం, పెదమడక ఉమామహేశ్వర ఆలయం, పాత అగనంపూడి లింగాల తిరుగుడి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. షిర్డీ సాయి ఆలయంలో విష్ణు సహస్రనామం, కార్తీక నామం, హన్‌మాన్, బాబా చాలీసాను భక్తులు పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, సత్యశ్రీదేవి, పంకజ, సూరీడమ్మ, లీలావతి, కన్నమ్మ, సుభాషిణి, రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్బీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో వేంకటేశ్వరస్వామిని పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలతో అలంకరించి తోమాలసేవ, పూజలు చేశారు. సాయంత్రం ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ శ్రీవారికి పూజలు జరిపాక ఆకాశ దీపాన్ని వెలిగించి కార్తీక మాసోత్సవాలకు శ్రీకారం చుట్టారు. పూజల్లో ఎస్బీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు దంపతులు, పాలక మండలి సభ్యులు జీవీ కృష్ణయ్య, వి.జీవన్‌బాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెందుర్తి-రూరల్: పురుషోత్తపురం హౌసింగ్ బోర్డు కాలనీ, శానాతివానిపాలెం, పోర్లుపాలెం, చింతలఅగ్రహారం, బ్రహ్మంగారి మఠం, తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో వేకువజామునే కార్తీక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.



రవినగర్ వెంకన్న ఆలయంలో ఆకాశదీపం వదులుతూ..

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్ గుడి వీధి శ్రీదుర్గామల్లేశ్వరాలయంలోని స్పటిక లింగానికి నాగ పడగల వెండి ఆభరణంతో ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక అభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రవినగర్ శివాలయం, కల్యాణ వెంకన్న ఆలయంలో సాయంత్రం ఆకాశ దీపాలను వదిలారు. వేపగుంట కొండపై ఉన్న శివాలయం, ముత్యాలమ్మ ఆలయం, ప్రహ్లాదపురం ఉమారామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్ఏడీ గణేశ్ నగర్‌లోని శ్రీప్రమాద ఉమావిశ్వేశ్వర కుమార్‌స్వామి దేవస్థానంలో అర్చకులు రామమూర్తి శర్మ ఆధ్వర్యంలో శివలింగాన్ని నాగకవచంతో అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. కాకానీనగర్‌లోని శ్రీఉమారామలింగేశ్వరాలయం, లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో ఉన్న శ్రీఉమాశంకరగణపతి అభయాంజనేయస్వామి ఆలయంలో, ఏపీఎస్ఈబీ కాలనీలోని శివాలయంలో జరిగిన పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వీనమ్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **పొట్టేల్ :** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)

● **దేవర :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● **వేట్టయాన్ :** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **విశ్వం :** శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 44, టమాటా 36, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 28, పచ్చిమిర్చి 48 కాకర కాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్ద) 7, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది) 60, బరబాటి 40, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	107
ఫారం ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

చంపుతానని బెదిరించిన రౌడీషీటర్ అరెస్టు

పెందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని సేవించేందుకు డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో స్నేహితడిని చంపుతానని బెదిరించిన రౌడీషీటర్‌ను పెందుర్తి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీమలాపల్లి సమీపం శేషాద్రినగర్‌కు చెందిన కొప్పల దేవేంద్రకుమార్ (27) అలియాస్ దేవ మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు హేమంత్‌కు ఫోన్ చేసి మద్యం కోసం డబ్బులడిగితే లేవని చెప్పాడు. దీంతో హేమంత్ ఇంటికి వెళ్లి ఫోన్ చేసి డబ్బులు అడిగితే లేవంటావా, నిన్ను చంపేస్తానంటూ దాడికి యత్నించాడు. ఈ సంఘటనతో భీతిల్లిన హేమంత్ భార్య లత పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని దేవాను అదుపులోకి తీసుకున్నారు. లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రౌడీషీటర్‌ను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగకు అరదండాలు

పెందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న దొంగను క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి పెద్దినాయుడు కాలనీలో హేమలత అనే మహిళ తన స్కూటీని పార్కింగ్ చేయగా చోరీకి గురైంది. అలాగే సుజాతనగర్‌కు చెందిన పాత్రో తన పల్సర్ బైక్‌ను పెందుర్తిలో పార్కింగ్ చేయగా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఆయా ఫిర్యాదుల మేరకు ఎస్ఐ విచారణ జరుపుతున్న నేపథ్యంలో శనివారం సరిపల్లి బ్రిడ్జి వద్ద అంపోలు కిశోర్‌కుమార్ (40) అనుమానాస్పదంగా సంచరించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కిశోర్‌కుమార్ పెందుర్తి జేఎస్ఎన్ఎంఆర్‌యూ కాలనీకి చెందిన పాత నేరస్తునిగా గుర్తించారు. నిందితుని వద్ద నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంతో ఇంట్లో సామగ్రి దగ్ధం

పెదగంట్యాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాబూ జగజ్జీవన్‌రామ్ కాలనీలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లోని గృహిణి వంట చేస్తుండగా పొయ్యిపై ఉన్న నూనె బాగా వేడెక్కి మంటలు చెలరేగాయి. దీంతో ఫ్రిజ్, ఎలక్ట్రికల్ వైరింగ్, పలు గృహోపకరణాలు కాలిపోవడంతో ఇల్లు కూడా బాగా దెబ్బతింది. పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పెదగంట్యాడ తహసీల్దార్‌కు సమాచారం అందించారు. అధికారులు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు.



చంద్రబాబుకు మొక్క, పుష్పగుచ్ఛం అందజేస్తున్న రౌతు శ్రీనివాస్, బల్ల శ్రీనివాసరావు

చంద్రబాబును కలిసిన కార్పొరేటర్లు

అగనంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడును 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా గల పలు సమస్యలను సీఎంకు వివరించారు. ముఖ్యంగా ఫార్మా కాలుష్య నివారణతో పాటు స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

వేపగుంట: పెందుర్తి నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న దేవస్థాన సమస్యను, వేపగుంట వుడా భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికల్లో ఈ సమస్యల పరిష్కారంపై హామీ ఇవ్వడం జరిగిందని, అందువల్ల వాటిని పరిష్కరించవలసిందిగా సీఎంను పరవాడలో కలిసి వేడుకున్నారు.

ఉక్కు పోరాట కమిటీ రిలే దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో ఈ నెలలో కూర్చునే యూనియన్‌ల జాబితాను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు శనివారం విడుదల చేశారు. ఇందులో భాగంగా ఆదివారం కాంట్రాక్టు కార్మికులు (హెచ్ఎంఎస్), 5, 8, 14, 20, 23, 27 తేదీల్లో ఇంటక్ నాయకులు, కార్మికులు దీక్షల్లో కూర్చుంటారు. అలాగే 6, 12, 15, 18, 21, 25 తేదీల్లో సీఐటీయూ, 4, 7, 13, 19, 22, 26, 28, 30 తేదీల్లో ఏఐటీయూసీ, 9న ఓబీసీ అసోసియేషన్, 10న కాంట్రాక్టు కార్మికులు (వైఎస్సార్‌టీయూసీ), 11, 29 తేదీల్లో యూజీ, డీఐటీయూ, జేఎంఎస్, వీఎస్ఎంఎస్, వీఎస్ఈయూ, వీఎస్‌పీయూఈ, 16న డీఎస్ఈయూ, టీఎన్‌టీయూసీ, 17న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 24న కాంట్రాక్టు కార్మికులు (ఏఐటీయయూసీ) దీక్షలో కూర్చుంటారు.



ఏడుగుళ్ల జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు

చంద్రబాబు హయాంలో ప్రజారంజక పాలన

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, నవంబరు 2: వైసీపీ పాలనలో రాష్ట్రమంతా నాశనమైందని, ఇప్పుడు దానిని పూడ్చడానికి సీఎం చంద్రబాబునాయుడు మంచి ఆలోచనలతో ముందుకు సాగుతూ ప్రజారంజక పాలనను అందిస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 61వ వార్డు పరిధి ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద శనివారం దీపం-2 సభను మహిళ సంఘాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని, ఇందులో భాగంగానే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకాన్ని అమలు చేస్తుందని పేర్కొన్నారు. దీపం-2 పథకం అర్హులందరికీ వర్తిస్తుందన్నారు. విశాఖకు రైల్వే జోన్‌తో పాటు ఆర్ఆర్‌బీ సెంటర్ వస్తుందన్నారు. ఆర్ఆర్‌బీ సెంటర్ ద్వారా ఎంతోమందికి ఉద్యోగావకాశాలు వస్తాయని, అందుకు తగ్గ ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం గణబాబు పలువురు మహిళలకు గ్యాస్ సిలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న, నాయకులు మజ్జి సోమేశ్, నక్కా లక్ష్మణరావు, ఏపీడీవో కృపానందం, సివిల్ సప్లైస్ ఏఎస్‌వో కృష్ణారావు, ఆర్ఐ మంగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అంగ దుర్గా ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్జీ నగర్‌లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

గోపాలపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 88వ వార్డు పరిధి నరవలోని ఎల్జీనగర్ కాలనీలో డీ-పట్టా నివాస స్థలాల విక్రయాలపై స్థానిక ఎస్సీ సంఘ ప్రతినిధులు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు పెందుర్తి తహసీలార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది కాలనీలో హెచ్చరిక బోర్డులను శనివారం ఏర్పాటు చేశారు. కాలనీలో ఎస్సీలకు కేటాయించిన డీ-పట్టా నివాస స్థలాలను ఇతరులు క్రయ విక్రయాలు చేయడం వల్ల ఎస్సీలు ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్‌వోలు విజయ, సాంబశివరావు పర్యవేక్షణలో కాలనీలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం పట్ల కాలనీకి చెందిన ఎస్సీ సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



ఎల్జీ నగర్‌లో బోర్డును ఏర్పాటు చేసిన సిబ్బంది

ఉత్తరాంధ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

'వేదిక' ప్రధాన కార్యదర్శి అజశర్మ

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఒక ప్రకటనలో కోరారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి వంశధార, నాగావళి నదులపై ప్రాజెక్టులు, ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వంటివి అవసరమని, ఎన్డీఏ ప్రభుత్వమే ఒడిశాలో ఉంది కాబట్టి ఆ రాష్ట్రానికి ఉన్న అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించి వంశధారపై నేరడి ప్రాజెక్టుతో సహా పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులన్నింటినీ పూరిచేయాలని విజ్ఞప్తి చేశారు. భావనపాడు ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేయాలని, పలాస కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌లలో శాశ్వత ఉద్యోగులను నియమించడంతో పాటు వైద్య పరికరాలను పూర్తి స్థాయిలో సమకూర్చాలన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీ, ఐఐఐటీలో అధ్యాపకులను, సిబ్బందిని నియమించాలని, కొవ్వాడలో అణు విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేయాలని, జీడి రైతులకు గిట్టుబాటు కల్పించాలని కోరారు. నవంబరు ఒకటిన రాష్ట్రావతరణ దినోత్సవాన్ని జరపకపోవడం దురదృష్టకరమని అజశర్మ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: తహసీల్దార్ భుజంగరావు



మల్కాపురం, నవంబరు 2: ములగాడ మండల పరిధిలో రెవెన్యూ పరంగా ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానానికి కృషి చేస్తానని తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భుజంగరావు పేర్కొన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రజా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సకాలంలో అవసరమైన వారికి అన్ని ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడతానని, విపత్తుల సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా కార్యాలయ ఆవరణలో పందుల బెడద అధికంగా ఉన్నందున ఈ సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళతానని ఆయనన్నారు.

ఉద్యోగులంతా నిజాయితీగా పని చేయాలి

షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ

మల్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తే సంస్థకు ఎంతో మేలు జరగడంతో పాటు సమాజం కూడా ఎంతో బాగుపడుతుందని షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ అన్నారు. షిప్‌యార్డులో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నీతి, నిజాయితీలపై అవగాహన కల్పించాలనే మంచి ఉద్దేశంతో క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: అందరూ నీతి, నిజాయితీతో మెలుగుతూ సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ సీనియర్ మేనేజర్ పి.సత్యనారాయణ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని అరికట్టడంలో ప్రతిఒక్కరూ కీలక పాత్ర పోషించాలన్నారు. లంచం ఇవ్వడం ఎంత నేరమో, తీసుకోవడం కూడా అంతే తప్పన్నారు. సైన్స్, టెక్నాలజీ, విద్య, పరిశ్రమలు, పబ్లిక్ సర్వీసెస్, గవర్నెన్స్, రాజకీయం వంటి రంగాలను రూపొందించడంలో విద్యార్థులంతా కీలకంగా వ్యవహరించాలన్నారు. s

తిరుమల నగర్ కాలనీవాసులకు మంత్రుల అభినందనలు

కూర్మన్నపాలెం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్ కాలనీకి జాతీయ స్థాయిలో జలశక్తి అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆధ్వర్యంలో శనివారం వీఎంఆర్డీఏ భవనంలో రాష్ట్ర మంత్రులు నారాయణ, డోలా బాల వీరాంజనేయులు, ఎంపీ ఎం.శ్రీభరత్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, వీఎంఆర్డీఏ చైర్మన్ విశ్వనాథన్‌లను కాలనీవాసులు కలిసి అవార్డును, సన్మానపత్రాన్ని చూపారు. మంత్రులు కాలనీ వాసులు నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకుని వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తిరుమల నగర్ అసోసియేషన్ ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, సన్యాసిరావు, అప్పలనాయుడు, టీడీపీ నాయకుడు ఎస్ఎస్ విజయరామరాజు, తదితరులు పాల్గొన్నారు.



అసోసియేషన్ ప్రతినిధులను అభినందిస్తున్న మంత్రులు

'విజ్ఞాన్' విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

అగనంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ తృతీయ సంవత్సర విద్యార్థులు శనివారం మెడిటెక్ జోన్, స్టీల్‌ప్లాంటును సందర్శించారు. ఈ సందర్భంగా మెడిటెక్‌లో ప్రోస్థెటిక్స్, ఆర్థోటిక్స్ పరికరాల తయారు చేయడం, డెమోను తిలకించారు. ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్‌ను సందర్శించారు. సెంటర్ ఫర్ త్రీడీ ప్రింటింగ్, లేజర్ కేంద్రాలు, గామా రెడియేషన్ అంశాలపై అధ్యయనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఈసీఈ హెచ్‌వోడీ పూడి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ విజేతకు అభినందనలు

శ్రీనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ 52-60 కిలోల విభాగ పోటీల్లో టీఎస్సార్ టీటీకే కళాశాల విద్యార్థిని జి.సాయి లిఖితకు ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. ఈ మేరకు శనివారం కళాశాలలో ఆమెను చైర్మన్ తలశిల బలరామకృష్ణ, తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, సాధించాలనే తపన, పట్టుదల ఉన్న విద్యార్థులు ఏ రంగంలోనైనా ఉత్తమ ఫలితాలను సాధిస్తారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు, బి.ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.



సాయి లిఖితకు అభినందనలు తెలుపుతున్న తలశిల బలరామకృష్ణ, తదితరులు

హుషారుగా చంద్రబాబు టూర్


రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ గురించి సీఎం చంద్రబాబుకు మ్యాప్ ద్వారా వివరిస్తున్న దృశ్యం

విశాఖ ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనం ఆద్యంతం హుషారుగా సాగింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు అనకాపల్లి జిల్లా పర్యటనలో పాల్గొన్న ఆయన అక్కడ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా రుషికొండకు చేరుకున్నారు. సుమారు గంటన్నర పాటు రుషికొండపై గత వైసీపీ ప్రభుత్వం నిర్మించిన ప్యాలెస్‌ను చంద్రబాబు క్షుణ్ణంగా పరిశీలించారు. సాయంత్రం ఐదు గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని మూడు జిల్లాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాత్రి పది గంటల సమయంలో పందిమెట్టలోని పార్టీ కార్యాలయానికి ఆయన చేరుకుని నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు.


ప్యాలెస్ లోపల నుంచి బయటకు చూస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తదితరులు


ప్యాలెస్ లోపలి ప్రాంతాన్ని క్షుణ్ణంగా చూస్తూ..


ప్యాలెస్ నుంచి సముద్ర తీరాన్ని తిలకిస్తున్న సీఎం


ప్యాలెస్ లోపల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబునాయుడు


ప్యాలెస్‌లోని మసాజ్ రూమ్‌ను వీక్షిస్తూ..


సీఎం చంద్రబాబుతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


ప్యాలెస్ వద్ద జనసేన కార్యకర్తలతో మాట్లాడుతున్న చంద్రబాబు


టీడీపీ కార్యాలయంలో రన్ ఫర్ అంబేద్కర్ పోస్టరును ఆవిష్కరిస్తూ..


చంద్రబాబును సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న గండి బాబ్జీ


సీఎంకు మొక్క అందజేస్తున్న గ్రేటర్ కమిషనర్


కుమార్తెకు జరిగిన ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయాలని ఓ తండ్రి వేడుకోలు


పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు


అధినేతతో సెల్ఫీలు దిగుతున్న కార్యకర్తలు


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ

రవాణా సేవల నుంచి 20 పాత బస్సులు నిష్క్రమణ

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని ఏడు డిపోల్లో ఉన్న 20 పాత బస్సులు రవాణా సేవల నుంచి నిష్క్రమించాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దశలవారీగా 20 కొత్త బస్సులు విశాఖ రీజియన్‌కు వచ్చాయి. దీంతో బాగా పాతబడిన, కాలం చెల్లిన బస్సులను విజయనగరం సెంట్రల్ గ్యారేజీకి దశలవారీగా తరలించారు. రీజియన్‌లోని మధురవాడ, వాల్తేరు, విశాఖపట్నం, మద్దిలపాలెం, గాజువాక, సింహాచలం, స్టీల్ సిటీ డిపోల నుంచి కాలం చెల్లిన బస్సులను అధికారులు ముందుగానే గుర్తించి ఒక్కొక్కటిగా తొలగించి, వాటి స్థానంలో కొత్తవి నడుపుతున్నారు.

స్టీల్‌ప్లాంటుపై కూటమి విధానం చెప్పాలి

» శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటుపై కూటమి ప్రభుత్వ విధానం ఏమిటనేది సీఎం చంద్రబాబు నాయుడు చెప్పాలని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. లాసన్స్‌బే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంటుపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రజలు ఉపేక్షించరని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను కూటమి నేతలు గౌరవించాలని, స్టీల్ ప్లాంట్ అంశాన్ని రాజకీయం చేయవద్దని కోరారు. ఉక్కుపై కేంద్ర మంత్రులు చెప్పేదానికి విరుద్ధంగా క్షేత్ర స్థాయిలో పరిణామాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రానికి ఇంకో స్టీల్‌ప్లాంట్ వస్తే సంతోషమే గానీ ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ముఖ్యమన్నారు. అమూల్ వచ్చాక రాష్ట్రంలో పాల సేకరణ ధర పెరిగిందని, అయితే విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను ఎందుకు తగ్గించిందో సమాధానం చెప్పాలని, పాడి రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని బొత్స డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏయూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రిటైర్డ్ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన మందులను అందజేస్తార న్నారు. ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెందుర్తిలో వరుస చోరీల కలకలం

» ఓ ఇంట్లో 8 తులాల బంగారు, 50 తులాల వెండి ఆభరణాలు అపహరణ

» రెండు ఆలయాల్లో హుండీల చోరీకి యత్నం




చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు. (ఇన్‌సెట్లో) సీసీ ఫుటేజీలో అనుమానితుడు

పెందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలో ఏకకాలంలో వరుస చోరీలు జరగడం కలకలం రేపింది. క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చోరీలు జరిగాయి. తాళం వేసిన ఓ ఇంటితో పాటు రెండు ఆలయాల్లో హుండీల చోరీ యత్నానికి అగంతకులు పాల్పడ్డారు. క్రైమ్ ఎస్‌ఐ సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెంలో నివాసం ఉంటున్న బలివాడ శ్రీనివాసరావు అనే వ్యక్తి నగరంలో ఆర్కిటెక్చర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి తమ ఇంటికి తాళం వేసి సమీపంలో ఉంటున్న బావమరిది కుమారుడు పుట్టినరోజు వేడుకులకు భార్య, కుటుంబ సభ్యులతో వెళ్లారు. రాత్రికి అక్కడే నిద్రించి, శనివారం ఉదయం ఇంటికి వచ్చారు. అయితే ఇంటి ప్రాంగణంలోని కిటికీ గ్లాస్ డోర్ తెరిచి ఉండడాన్ని గమనించి ఆందోళనతో లోపలకు వెళ్లి చూశారు. బీరువాలో భద్రపరిచిన ఎనిమిది తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు మాయమవ్వడంతో చోరీ జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ ఎస్‌ఐ డి.సూరిబాబు సం ఘటనా స్థలానికి చేరుకుని సీసీ టీవీల ఫుటేజీలను పరిశీలించారు. అగంతకుడు కిటికీ గ్లాస్ డోర్ తెరుచుకుని లోపలకు వెళ్లిన దృశ్యాలు కనిపించాయి. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుండీల చోరీకి యత్నం

చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని సాయిబాబా ఆలయం, శ్రమశక్తినగర్‌లోని మరో ఆలయంలో శుక్రవారం హుండీల చోరీకి దొంగలు యత్నించారు. నగదు లభించక పోవడంతో చిల్లర నాణేలతో సహా హుండీలను చోరులు బయటకు విసిరేశారు. వీటిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ బోల్తా పడి ఐటీ ఉద్యోగి మృతి


క్రాంతికుమార్ (ఫైల్‌ఫొటో)

ఎండాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ ఐటీ రోడ్డులో బైక్ బోల్తా పడడంతో ఐటీ ఉద్యోగి మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మధురవాడలోని నగరపాలెం రోడ్డులో నివాసం ఉంటున్న మతాల రమాప్రభ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. ఆమె భర్త పాల్గుణరావు శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో వ్యవసాయ పనులు చేస్తుంటారు. వారికి ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు క్రాంతికుమార్ (21) టెక్ మహేంద్రలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై విధులకు వెళ్తుండగా పనోరమ హిల్స్ నుంచి ఐటీ రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలతో ఉన్న అతన్ని స్థానికులు చూసి సమీపంలోని గీతం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

డాబాగార్డెన్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే ప్లాట్‌ఫారంపై గంజాయి సంచులతో ఉన్న వ్యక్తిని జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ ఎస్.చిట్టిబాబులు పట్టుకున్నారు. శనివారం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేస్తుండగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన జి.గణపతి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి గంజాయిను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుని నుంచి రూ.70 వేల విలువైన 14 కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలను పట్టుకోవడానికి విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీస్, ఆర్‌పీఎఫ్ ఫోర్స్ ప్రత్యేక బృందం సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటు చేసి సింహాచలం, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి రైల్వేస్టేషన్లలో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్టు ఎస్.ఐ. తెలిపారు.